# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం








సంపుటి: 01 | సంచిక: 279 | హైదరాబాద్ | బుధవారం | 26-03-2025 | పేజీలు: 08


# విద్యారంగంపై తీవ్ర నిర్లక్ష్యం



- రిక్రూట్‌మెంట్లు పెరిగినా.. డ్రాపౌట్స్ పెరగడమేంటి
- ప్రభుత్వ తీరును నిలదీసిన బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి
- తమ హయాంలో విద్యావ్యవస్థను పటిష్టం చేశామన్న హరీశ్ రావు

**ప్రజాక్షేత్రం హైదరాబాద్,మార్చి25:**

టీచర్ల రిక్రూట్‌మెంట్ జరిగినా.. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ ఔట్స్ పెరగడం ఏమిటని తెలంగాణ అసెంబ్లీలో బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తీవ్ర విమర్శలు చేశారు. బడ్జెట్ పద్దులుపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా వాడీవేడి చర్చ సాగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం 26 వేల మందిని మాత్రమే రిక్రూట్ చేసిందని, ఇక కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే క్రెడిట్ తీసుకుంటుందని రాకేశ్ రెడ్డి విమర్శించారు. అంతమందిని రిక్రూట్ చేశారని చెబుతున్నారు. కానీ గతంలో ఒక్కటే కాలేజీ ఉండేది. ఇప్పుడు 100కు పెరిగాయి. కానీ ప్రభుత్వ విద్యా వ్యవస్థలో మౌలిక సదుపాయాలు ఇంకా గణనీయంగా అభివృద్ధి చెందలేదని ఆయన అన్నారు. ఆయన తన ప్రసంగంలో విద్యా వ్యవస్థలో ఏర్పడిన లోపాలను ఎత్తిచూపారు. పదేళ్లలో 6,000 ప్రభుత్వ స్కూళ్లు

మిగతా 2వ పేజీలో..





# కేబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్

- మంత్రి పదవిపై పలువురి ఆశలు
- మంత్రి పదవి ఎవరిని వరిస్తుందోనని చర్చలు

**ప్రజాక్షేత్రం హైదరాబాద్,మార్చి25:**

ఎప్పుడెప్పుడా అని ఆశావహులు ఎదురుచూస్తోన్న తెలంగాణ కేబినెట్ విస్తరణకు ముహూర్తం దగ్గరపడిరది. ఉగాది కానుకగా తెలంగాణ మంత్రి వర్గ విస్తరణకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నాలుగు మంత్రి పదవులు, డిప్యూటీ స్పీకర్, చీఫ్‌విప్ పదవుల భర్తీకి ఆమోద ముద్ర పడిరది. అయితే కేబినెట్‌లో రెండు బెర్త్‌లను పెండిరగ్‌లో పెట్టాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్, కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో తెలంగాణ సీఎం, కాంగ్రెస్ కీలక నేతలతో ఢిల్లీలో సోమవారం సుదీర్ఘ సమావేశం జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్.. అధిష్టానంతో భేటీ అయ్యారు. తెలంగాణలో ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు. పార్టీ బలోపేతంపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. అన్ని విషయాలతో పాటు కేబినెట్ విస్తరణపై కూడా చర్చ జరిగిందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. మార్పు నినాదంతో కాంగ్రెస్ అధికార

మిగతా 2వ పేజీలో..





## ఎంపీలకు భారీగా పెరిగిన వేతనాలు

కనీసం నెలకు లక్ష పెంచిన కేంద్రం


02

## స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నిక షెడ్యూల్

02

## ఖజానా ఖాళీ చేస్తూ పోతే ఎలా

02



# హోంశాఖ నా ఫేవరేట్

- మంత్రి పదవి వస్తదనే అనుకుంటున్నా
- కెపాసిటీని బట్టి మంత్రులను ఎంపిక చేయాలి
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**ప్రజాక్షేత్రం హైదరాబాద్,మార్చి25:**

మంత్రి పదవి వస్తదనే అనుకుంటున్నా... కెపాసిటీని బట్టి మంత్రులను ఎంపిక చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. తాజాగా మీడియా చిట్‌చాట్‌లో ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు. భువనగిరి ఎంపీ బాధ్యతలు ఇస్తే.. సమర్థవంతంగా నిర్వహించానని గుర్తు చేశారు. తనకు హోంమంత్రి పదవి అంటే ఇష్టమన్నారు. ఏ పదవి వచ్చినా సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రజల పక్షాన నిలబడతానని స్పష్టం చేశారు.. నిన్న ఢిల్లీలో సీరియస్‌గానే కేబినెట్ పై చర్చ జరిగినట్లు ఉందన్నారు. తెలంగాణ క్యాబినెట్ విస్తరణకు ముహూర్తం దాదాపుగా ఖరారు అయింది. ఉగాది నాటికి విస్తరణ పూర్తి చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. గత ఏడాదిన్నరగా విస్తరణకు సంబంధించి అనేక

మిగతా 2వ పేజీలో..



## స్పీకర్ ప్రసాద్‌కుమార్ వ్యాఖ్యలు బాధ కలిగించాయి

- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**ప్రజాక్షేత్రం హైదరాబాద్,మార్చి25:**

స్పీకర్ ప్రసాద్‌కుమార్ వ్యాఖ్యలు తనకు బాధ కలిగించాయని నారాయణఖేడ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. తాను ఏం తప్పు చేశానని, మీకు ఎందుకు అలా వినాలనిపించలేదని స్పీకర్‌ను

మిగతా 2వ పేజీలో..

# ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్

- గత తీర్పులను ఎలా కాదనగలమన్న ధర్మాసనం
- విచారణ ఏప్రిల్ 2కు వాయిదా

**ప్రజాక్షేత్రం న్యూఢిల్లీ, మార్చి25:**



తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ విచారణను సుప్రీం కోర్టు ఏప్రిల్ 2కు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఫిరాయింపుల వ్యవహారాల్లో ముగ్గురు, ఐదుగురు రాజ్యాంగ ధర్మాసనాలు చర్య తీసుకునేందుకు తగిన సమయం అని చెప్పలేదని.. అలాంటప్పుడు వాటిని కాదని తామెలా వెళ్లగలమని సుప్రీం ప్రశ్నించింది. ఉన్నత ధర్మాసనాల తీర్పులను తిరిగి ఎలా రాయగలం అంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం.. పిటిషనర్ల తరపు న్యాయవాదులను ప్రశ్నించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు సంబంధించి అనర్హత

మిగతా 2వ పేజీలో..

## క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు గుల్ల

2

- ఆత్మహత్య చేసుకున్న యువకుడు
- ఆత్మహత్య పరిష్కారం కాదన్న సజ్జనార్






# మరో మృతదేహం లభ్యం

- ఎస్ఎల్‌బీసీ ఘటనలో
- గత నెల 22న ప్రమాదం

**ప్రజాక్షేత్రం మహబూబ్‌నగర్, మార్చి25:**

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో గత ఫిబ్రవరి 22న టన్నెల్ నందు ప్రమాదం జరుగగా ఎనిమిది మంది కార్మికులు, ఇంజనీర్లు, మిషన్ ఆపరేటర్లు చిక్కుకొని జలసమాధి అయ్యారు. ప్రమాదం జరిగిన నాటి నుంచి పలు రెస్క్యూ టీంలు రేయింబవళ్లు వారి ఆచూకీం కోసం పనిచేస్తున్నాయి. ఈ క్రమంలోనే మరో కార్మికుడి మృతదేహం ఆచూకీ లభ్యమైనది. టన్నెల్‌లో సహాయక చర్యలు కొనసాగిస్తున్న రెస్క్యూ సిబ్బందికి టిబిఎం మిషన్ కింద కన్వేయర్ బెల్టు డ్రమ్‌కు

మిగతా 2వ పేజీలో..



# కొత్త మద్యం పాలసీపై వాడీవేడి చర్చ

- బెల్టు తీయాలన్న వేముల ప్రశాంత్ రెడ్డి

**ప్రజాక్షేత్రం హైదరాబాద్,మార్చి25:**



కొత్త మద్యం పాలసీ, బెల్టు షాపుల నిర్వహణపై అసెంబ్లీలో వాడీవేడి చర్చ జరిగింది. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం పెంచుకునేందుకు లిక్కర్ రేట్లు అడ్డగోలుగా పెంచుతోందని, కొత్త మద్యం పాలసీని

మిగతా 2వ పేజీలో..

# బట్టలు విప్పుడు.. కత్తులు దూసుడు

- **అసెంబ్లీ సమావేశాలపై మల్లారెడ్డి వ్యాఖ్యలు**

**ప్రజాక్షేత్రం, హైదరాబాద్,మార్చి25:**

మాజీ మంత్రి మల్లారెడ్డి ఎప్పుడు ఉన్నది ఉన్నట్టు మాట్లాడటం ఆయన నైజాం. ఆయన పలు విచిత్రంగా స్టేజీలమీద, విలేకరుల సమావేశాల్లో పలు కామెంట్లు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల మీద మంగళవారం కామెంట్ చేశారు. అప్పటి అసెంబ్లీ సమావేశాలు.. ఇప్పుడు జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల మధ్య వ్యత్యాసాలను చెప్పుకొచ్చారు. గతంలో అసెంబ్లీని ప్రజలు ఆసక్తిగా చూసేవారని అన్నారు. ఇప్పుడు మాత్రం బట్టలు విప్పుడు, కత్తులు దూసుడే అన్నట్లుగా సమావేశాల్లో కనిపిస్తోందంటూ కామెంట్స్ చేశారు. అంతే కాకుండా అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, వివేక్ మధ్య జరిగిన సంభాషణ కూడా ఆసక్తికరంగా మారింది. పార్లమెంట్‌లో ఆనాడు మాజీ ప్రధాని వాజుపేయి లాంటి వారు మాట్లాడుతుంటే దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురు చూసేవారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డి లాంటి నాయకులు సభలో మాట్లాడుతుంటే ప్రజలు టీవీలకు అతుక్కుని పోయేవారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అసెంబ్లీలో కేసీఆర్ ఏం మాట్లాడతారని ఆసక్తి ఉండేదని చెప్పుకొచ్చారు. కానీ.. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీలో మాత్రం బట్టలు విప్పుడు, కత్తులు దూసుడే కనిపిస్తోందంటూ మాజీ మంత్రి వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడీ కామెంట్స్ సంచలనంగా మారాయి. ఇక.. అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. మంగళవారం అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేక్ ఒకరికొకరు ఎదురుపడ్డారు. 'వివేక్‌ను.. నమస్తే మంత్రి గారు' అంటూ మల్లారెడ్డి పలకరించారు. ఇందుకు థాంక్స్ మల్లన్న అని పలకరించారు వివేక్ వెంకటస్వామి. రాష్ట్రంలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఫ్యామిలీ, వివేక్ వెంకటస్వామి ఫ్యామిలీదే హవా నడుస్తోందంటూ మల్లారెడ్డి కామెంట్స్ చేయగా.. బీఆర్ఎస్ హయంలో కేసీఆర్, మల్లారెడ్డిదే హవా నడిచిందని వివేక్ సమాధానం ఇచ్చారు. దీంతో వీరిద్దరి పలుకరింపులు ఆసక్తిగా మారాయి.

# 35 సవరణలకు అనుమతి

- **లోక్‌సభలో ఫైనాన్స్ బిల్లుకు ఆమోదం**

**ప్రజాక్షేత్రం, న్యూఢిల్లీ,మార్చి25:**

ఆన్‌లైన్ ప్రకటనలపై 6 శాతం డిజిటల్ పన్నును రద్దు చేయడంతో పాటు 35 ప్రభుత్వ సవరణలతో ఫైనాన్స్ బిల్లు 2025ను లోక్ సభ ఆమోదించింది. దీంతో బడ్జెట్ ఆమోదం పక్రియ లోక్‌సభలో పూర్తయింది.ఇక రాజ్యసభలో ఫైనాన్స్ బిల్లు పై చర్చ జరగనున్నది. రాజ్యసభ కూడా ఆమోదిస్తే 202526 బడ్జెట్ ఆమోదం పక్రియ పూర్తయినట్లే.. 2025 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరానికి కేంద్రం స్పాన్సర్ చేస్తున్న పథకాలకు రూ 5,31,850.21 కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ కేటాయింపు రూ. 4,15,356.25 కోట్లుమాత్రమే. కేంద్ర ప్రభుత్వ రంగ పథకాలకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 16.29 లక్షల కోట్లు కేటాయించారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాల వాటా, గ్రాంట్లు, రుణాలు, కేంద్రం ప్రాయోజిత పథకాల కింద విడుదల చేసే మొత్తంతో సహా రాష్ట్రాలకు బదిలీ అయ్యే నిధులు రూ. 25,01,284 కోట్లు. అలాగే 202526 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు 4.4శాతంగా అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు 4.8 శాతంగా అంచనావేశారు. 202526 ఆర్థిక సంవత్సరంలో స్థూల జాతీయ ఉత్పత్తి (జిడిపి) రూ. 3,56,97,923 కోట్లుగా అంచనా వేశారు. జాతీయ గణాంక సంస్థ విడుదల చేసిన ఈ ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల ప్రకారం జిడిపీ రూ. 3,24,11,406 కోట్లు. అంటే కొత్త ఆర్థిక సంవత్సరంలో జిడిపీ 10.1 శాతం ఎక్కువగా ఉంటుందని అంచనా.

# క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు గుల్ల

- **ఆత్మహత్య చేసుకున్న యువకుడు**
- **ఆత్మహత్య పరిష్కారం కాదన్న సజ్జన్నార్**

**ప్రజాక్షేత్రం, హైదరాబాద్,మార్చి25:**

మేడ్చల్ జిల్లా గౌడవెల్లి గ్రామానికి చెందిన 24 ఏళ్ల సోమేశ్ క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమేశ్ తల్లిదండ్రులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. క్రికెట్ బెట్టింగ్ లో డబ్బులు పోగొట్టుకొని తన కొడుకు సోమేశ్ తెల్లవారు 4గంటలకు ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. తమ ఇంటి సమీపంలోని గౌడవెల్లిలో రైల్ ట్రాక్ పై పడుకొని ఆత్మహత్య చేసుకున్నడన్నారు. లక్షల్లో సోమేశ్ క్రికెట్ బెట్టింగ్ పెట్టాడని తెలిపారు. గతంలో తమ కూతురు వివాహం కోసం సోమేశ్ అప్పు చేశాడని అప్పు తీర్చామన్నారు. అందరితో బాగానే మాట్లాడాడని.. రాత్రి ఏం జరిగిందో? ఎవరు టార్చర్ చేశారో తెలియదన్నారు. మనోవేదనకు గురై సోమేశ్ సూసైడ్ చేసుకున్నాడని.. తమకు కడుపుకోత మిగిల్చాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన ఈ అన్యాయం ఎవరి కుటుంబంలో జరగకూడదని ఆ తల్లిదండ్రులు తెలిపారు. బెట్టింగ్ యాప్స్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. సోమేశ్ చనిపోయే ముందు స్నేహితులకు వాట్సప్‌లో లొకేషన్ షేర్ చేశాడని.. తామంతా లొకేషన్ కి వెళ్లేసరికి మృతదేహం పడి ఉందని కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఈ విషాద ఘటనపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. సమస్య ఏదైనా సరే.. ఆత్మహత్య అనేది పరిష్కారం కాదు అని యువతకు సూచించారు. బెట్టింగ్ భూతాన్ని పూర్తిగా నిర్మూలించడానికి సజ్జనార్ అవిరామ కృషి చేస్తున్న విషయం తెలిసిందే. సజ్జనార్ తన ఎక్స్ ఖాతాలో ఈవిధంగా రాసుకొచ్చారు. 'ఆన్ లైన్ బెట్టింగ్ భూతానికి వ్యసనపరులై బలవన్మరణాలకు పాల్పడకండి. ఆలోచించండి.. మీరు క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాల వల్ల మీ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎంతటి క్షోభను అనుభవిస్తారో ఆలోచించండి. సమస్య వచ్చినప్పుడు దాని నుంచి ఎలా బయటపడాలో
అన్వేషించాలే తప్ప.. చనిపోవాలనే ఆలోచనే రాకూడదు. ఉన్నది ఒక్కటే జీవితం. ఏం సాధించిన అందులోనే. జీవన ప్రయాణంలో ఒక్కసారి కిందపడితే.. సర్వం కోల్పోయినట్లు కాదు కదా. అమూల్యమైన జీవితాన్ని అర్ధాంతరంగా కాలదన్నుకోవద్దు. చీకటి వెలుగులా నిత్యం కష్టసుఖాలు అందర్నీ వెంటాడుతూనే ఉంటాయి. కష్టకాలంలో బాధలను ఇతరులతో పంచుకోవాలి. పరిష్కార మార్గాలు వెతకాలి. ఎంత కష్టం వచ్చినా ఎల్లకాలం ఉంటుందా? చనిపోయినంత మాత్రాన సమస్యలు టక్కున మాయమవుతాయా!?.. బలవన్మరణం వద్దు.. బతికి సాధించడమే ముద్దు' అని యువతకు సూచించారు.

# విద్యారంగంపై తీవ్ర నిర్లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి**



మూతపడ్డాయని, గత ఏడాది లోపలే 1,800 స్కూళ్లు మూతపడిన విషయం గమనార్హమని చెప్పారు. అప్పుడు బంగారు తెలంగాణ అని చెప్పారు, ఇప్పుడు వజ్రాల తెలంగాణ అంటున్నారు. కానీ విద్యా రంగం మాత్రం దిగజారిపోతోంది. 1931 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు లేకుండా ఉన్నాయి. ఇన్ని వేల కోట్ల బడ్జెట్ పెట్టినా పరిస్థితి మారడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్కూళ్లపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారు. స్కూళ్లలో ఒకటే బాత్రూం ఉంటుంది, అక్కడ పందులు తిరుగుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలు ఎలా ప్రభుత్వ స్కూళ్లలో చదవగలరని అన్నారు. తల్లిదండ్రులు అప్పు చేసి ప్రైవేట్ స్కూళ్లకు పంపించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో ఆలోచించాలని పైడి రాకేశ్ రెడ్డి అన్నారు. విద్యాశాఖ సీఎం వద్ద ఉంది. కానీ సీఎం దగ్గర చాలా పనులు ఉంటాయి. కాబట్టి ఈ శాఖను మరొకరికి అప్పగిస్తే మంచిది. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిని మెరుగుపరిచే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. లేకపోతే డ్రాప్ ఔట్స్ సంఖ్య ఇంకా పెరుగుతుందని ఎమ్మెల్యే సూచించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి సీనియర్ సభ్యుల సూచనలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, రిటైర్డ్ ఆఫీసర్ల సహాయంతో పాఠశాలల నిర్వహణను మెరుగుపర్చాలన్నారు రాకేశ్ రెడ్డి. స్కూళ్లకు కాంపౌండ్ వాల్, శుభ్రమైన వసతులు కల్పించాలని, బడ్జెట్ కేటాయింపులను స్పష్టంగా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇకపోతే ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలకు అసెంబ్లీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు కౌంటర్ ఇచ్చారు. తాము ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని నిరూపించగలవా అని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు హరీశ్ రావు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ జరగలేదని మంత్రి శ్రీధర్ బాబు సత్యదూరం మాటలు మాట్లాడారు. నేను ఛాలెంజ్ వేస్తున్నా.. బీఆర్ఎస్ హయాంలో 26 వేల ఉపాధ్యాయ నియామకాలు జరిగాయి.. 8 వేల ఉద్యోగాలు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా, మరో 18 వేల ఉద్యోగాలు గురుకులాల్లో నియామకాలు చేసినం. 26 వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తే ఒక్కటి కూడా భర్తీ చేయలేదని శ్రీధర్ బాబు మాట్లాడడం సరికాదు. ఇక రెండో విషయానికి వస్తే.. ఎన్ని స్కూళ్లు మూతపడ్డాయని మా సబితక్క అడిగితే.. 79 స్కూల్స్ తెరిపించామని బాగానే చెప్పారు. కానీ కాంగ్రెస్ పాలనలో మూతబడ్డ 1913 స్కూళ్ల సంగతి ఎందుకు మాట్లాడరని అడుగుతున్నానని మంత్రి శ్రీధర్‌బాబును హరీశ్‌రావు ప్రశ్నించారు.

# స్పీకర్ ప్రసాద్‌కుమార్ వ్యాఖ్యలు బాధ కలిగించాయి

**మొదటి పేజీ తరువాయి**

ప్రశ్నించారు. విషయంపైనే మాట్లాడానుతప్ప ఎక్కడా పరిధి దాటలేదన్నారు. అయినా తనను అలా వినబుద్ధికావడం లేదని ఎలా అంటారన్నారు. తనపై వ్యాఖ్యలను స్పీకర్ ఉపసంహరించుకోవాలన్నారు. శాసనసభలో సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ''సభ్యుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌పైనే ఉంటుందని తెలిపారు. నిన్న మీరు చేసిన వ్యాఖ్యలు చాలా బాధాకరమని పేర్కొన్నారు. తాను మాట్లాడుతున్న సందర్భంలో సబ్జెక్టునుంచి ఎక్కడా డీవియేట్ కాలేదు. మహిళలు, శిశు సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ సమస్యలపై మాట్లాడుతానని ముందే సమాచారం ఇచ్చానన్నారు. అవకాశం కోసం సాయంత్రం వరకు నిరీక్షించా. రాత్రి 8 గంటలకు మాట్లాడేందుకు తనకు అవకాశం కల్పించారన్నారు. రెండు నిమిషాల్లో పూర్తిచేయాలన్నారు. తాను మాట్లాడుతుండగా.. నాకే వినబుద్ధి అవడలేదని, మీరంతా ఎలా వింటున్నారో అని మీరు అనడం నాకు చాలా బాధకలిగించింది. ఒక మహిళగా, సీనియర్ సభ్యురాలినైనా తాను ఎక్కడా అన్‌పార్లమెంటరీ మాట్లాడలేదని.. ఎందుకంటే సభలో ముఖ్యమంత్రి, మంత్రులు, సభ్యులు అంతా మాట్లాడినప్పటికీ.. జీరో అవర్‌లో ఒకటే సబ్జెక్ట్ మాట్లాడాలని, అసభ్య పదజాలం మనం ఉపయోగించకూడదని కొత్తగా వచ్చిన మా సభ్యులకు చెబుతానని తెలిపారు. ఒకరికి చెప్పగలిగిన స్థాయిలో ఉన్న తనను మీరు మాట్లాడిన మాటలు చాలా బాధ కలిగించాయని ఆవేదన వ్యక్తంచేశారు. సబ్జెక్టును మించి ఒక విషయం కూడా బయటకు జరుగలేదు. అలాంటి సమయంలో మీరు మాట్లాడిన మాటలు నాకు బాధ కలించాయి. సభలో నిరసనల మధ్య తనకు సరిగా వినపడలేదని, వాకౌట్ చేసి బయటకు వెళ్లిన తర్వాత మా సభ్యులు చెప్పారు. తాను తప్పేంమాట్లాడానో చెప్పండి. నా నియోజకవర్గానికి సంబంధించిన సమస్యల గురించి మాట్లాడానే తప్ప మరో విషయం కాదు. మీ వ్యాఖ్యలు మంచిగనిపిస్తే రికార్డుల్లో కొనసాగించండి. లేదంటే ఉపసంహరించుకోవాలి. సభాపతిగా మా హక్కులు కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌ది. అధికార పక్షానికి నచ్చకపోతే బాగాలేదని చెప్పాలి. గతంలో కూడా మహిళలను ఉద్దేశించి ముఖ్యమంత్రి అభ్యంతరకరంగా మాట్లాడారని, అయినప్పటికీ నిలుచుని మానంగా నిరసన తెలిపాం. ఇలాంటివి మరోసారి జరగకూడదని, సభా సంప్రదాయాలకు మంచిదికాదు' అని స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు లక్ష్మారెడ్డి సూచించారు. కాగా, స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. మహిళలంటే తనకు ఎనేలని గౌరవం ఉందన్నారు. తనకు 8 మంది సోదరీమణులు ఉన్నారని, మహిళలను గౌరవిస్తానని చెప్పారు. 'మిమ్మల్ని ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేయలేదు. తాను ఈ సీటు మీద ఉండి తమను అన్నానని అనుకోవడం చాలా పొరపాటు. మీరు మాట్లాడేటప్పుడు ఇరువైపులా నుంచీ రన్నింగ్ కామెంట్ వస్తున్నదన్నారు. దీంతో వారు మాట్లాడేది నాకే వినబుద్ధి అవుతలేదని తెలిపారు. మీకు వినబడుతున్నదా అని అన్నాను. మిమ్మల్ని ఉద్దేశించి అలా అనలేదు. మీ మనసు కష్టపడితే ఆ వ్యాఖ్యలను విత్‌డ్రా చేసుకుంటున్నాను.' అని చెప్పారు.

**ఓయూ ఆంక్షలపై చర్చించండి.. బీఆర్ఎస్ వాయిదా తీర్మానం**

ఉస్మానియా యూనివర్సిటీలో ఆంక్షలపై అసెంబ్లీలో చర్చించాలంటూ బీఆర్ఎస్ పార్టీ వాయిదా తీర్మానం ఇచ్చింది. విద్యార్థుల ప్రజాస్వామిక హక్కులను హరించే విధంగా ర్యాలీలు, ధర్నాలు, నిరసనలపై నిషేధం విధించడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపింది. దీనిపై శాసనసభలో చర్చించాలని ప్రతిపాదించింది. ఈమేరకు అసెంబ్లీ కార్యదర్శికి వాయిదా తీర్మానం అందించింది. ఎన్నో ఉద్యమాలకు వేదికైన ఉస్మానియా యూనివర్సిటీపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. పోరాటాలకు ఊపిరిలూదిన విద్యార్థిలోకంపై కక్షగట్టింది. ఏకంగా ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ ఆవరణలో ఆందోళనలపై ఈ నెల 15న నిషేధం విధించింది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమకారులపై ఆనాటి పాలకులు ఊరూరా ఉక్కుపాదం మోపుతున్న తరుణంలోనూ ఓయూ విద్యార్థి ఉద్యమంపై ఎలాంటి నిషేధాజ్ఞలు విధించలేదు. కానీ, నేడు 'ప్రతికూల ప్రభావం' అంటూ సాకుగా చూపి రేవంత్ సర్కారు అణచివేత చర్యలకు దిగింది. వర్సిటీలో అన్నిరకాల ధర్నాలు, నిరసన ప్రదర్శనలపై నిషేధం విధిస్తూ శనివారం ఓయూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల తర్వాత ఉస్మానియాపై ఇలాంటి నిషేధాజ్ఞలు విధించడం విపరిణామమే. వర్సిటీ అధికారుల ఈ నిర్ణయంపై విద్యార్థి సంఘాల నేతలు, విద్యావేత్తలు మండిపడుతున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ, దాని విభాగాలు, కళాశాలలు, కేంద్రాలు, పరిపాలనా భవనాల్లో ఆందోళనలు, ధర్నాలు, ప్రదర్శనలు నిషేధిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి ఈ సర్క్యులర్ జారీ చేశారు. నిరసనలు యూనివర్సిటీ పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపడంతోపాటు పరిపాలన, విద్యా పురోగతిని జాప్యంచేసే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో భద్రతా సమస్యలు సైతం తలెత్తాయని తెలిపారు. వర్సిటీ భవనాల్లోకి అనధికారికంగా ప్రవేశించడం, ధర్నాలు, ఆందోళనలు, ప్రదర్శనలు నిర్వహించకుండా నిరోధించడం, వర్సిటీ ఉద్యోగులు, అధికారులపై అభ్యంతరకరమైన భాషను వినియోగిస్తూ దూషించడాన్ని సంపూర్ణంగా నిషేధించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన విద్యార్థులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూనివర్సిటీ విద్యార్థులకు ఏదైనా ఫిర్యాదులు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించడం ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు.

## మృతదేహం లభ్యం

**మొదటి పేజీ తరువాయి**

40 మీటర్ల దూరంలో మృతదేహం ఆనవాళ్లు కనిపించాయి. టన్నెల్ నందు మినీ జెసిపి ద్వారా శిథిలాలు తొలగించడం, మట్టి బురదను బయటకు పంపడం సహాయక చర్యలు కొనసాగుతుండగా శిథిలాల కింద మృతదేహం ఆనవాళ్లు కనిపించాయి. అట్టి మృతదేహం పూర్తిగా కుళ్ళిపోయి ఉండడం, ఆ ప్రదేశం భరించలేని దుర్వాసన వస్తుండడంతో మిగిలిన ఆరుగురి మృతదేహాలు కూడా అదే ప్రదేశంలో ఉండే అవకాశం ఉంటుందని అనుమానిస్తున్నారు. రెస్క్యూ బృందాలు దుర్వాసన వస్తుండడంతో స్ప్రే బాటిల్స్ తీసుకొని లోపలికి వెళ్లారు. మృతదేహాన్ని బయటకు తీయడానికి టిబిఎం మిషన్ పరికరాలు గ్యాస్ కట్టర్ ద్వారా తొలగించడం, మృతదేహం చుట్టూ భారీగా పేరుకుపోయిన శకలాలు, మట్టి బురద తొలగించడం లాంటి సహాయక చర్యలు వేగవంతం చేసి మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. మృతుడిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రాజెక్టు ఇంజినీర్ మనోజ్ కుమార్‌గా గుర్తించారు. అనంతరం డెడ్‌బాడీని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శవ పరీక్ష అనంతరం డెడ్‌బాడీని మనోజ్ కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

## హోంశాఖ నా ఫేవరేట్

**మొదటి పేజీ తరువాయి**

ఊహగానాలు వినిపించినప్పటికీ తాజాగా అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. క్యాబినెట్ విస్తరణతో పాటు ఇతర పదవులు... నామినేటెడ్ పోస్టుల నిర్ణయం తీసుకోనున్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీలో పార్టీ అగ్రనేతలతో భేటీ అయ్యారు. సీఎంతో పాటు డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నారు. వీరంతా రాహుల్ గాంధీ, ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో నాలుగు మంత్రి పదవులు ఎవరికి ఇవ్వలని నిర్ణయం తీసుకున్నారో తెలియాల్సి ఉంది.

## కొత్త మద్యం పాలసీపై వాడీవేడి చర్చ

**మొదటి పేజీ తరువాయి**

వెంటనే విత్ డ్రా చేసుకోవాలని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కొత్త ప్రభుత్వం.. కొత్త బ్రాండ్లు.. కొత్త బీర్లు, కొత్త బార్లు, కొత్త పబ్‌లు ఇదేనా ప్రభుత్వ పాలసీ అని ప్రశ్నించారు. ?రాష్ట్రవ్యాప్తంగా బెల్టు షాపులు తీసేయాలని డిమాండ్ చేశారు. ఆదాయ మార్గాన్ని పెంచేందుకు బెల్టు షాపులను పెంచే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీనికి శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలోనే అడ్డగోలుగా.. ఇష్టానుసారంగా మద్యం అమ్మకాలు జరిపారని ఫైర్ అయ్యారు. ఆఖరికి రేషన్షాపుల్లో కూడా లిక్కర్ సేల్స్‌కు పర్మిషన్ ఇచ్చిన చరిత్ర బీఆర్ఎస్‌కు ఉందన్నారు. బెల్టు షాపులపై వారు తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని సెటైర్ వేశారు. బెల్టు షాపులు తామే తెచ్చామని ప్రశాంత్ రెడ్డి ఒప్పుకోవడం సంతోషకరం. బెల్టు షాపులు మేం పెంచలేదు. అలాంటివి మేం ఎంకరేజ్ చెయ్యబోం. ప్రభుత్వంలో లీకేజెస్ ఉండొద్దు అనే ఆదాయం పెంచుతామన్నం. బీఆర్ఎస్ హయాంలో అడ్డగోలుగా ఇష్టారాజ్యాంగ చౌక షాపుల్లో మద్యం అమ్మకాలు జరిగాయి. ఎక్సైజ్ శాఖలో లీకేజెస్ లేకుండా సర్కార్ చేపడుతుంది. రీఫామ్ తెస్తాం. దీని వల్ల రెవెన్యూ పెంచుకుంటాం' అన్నారు.

# ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్

**మొదటి పేజీ తరువాయి**



పిటిషన్లపై సుప్రీం కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తరవున సీనియర్ న్యాయవాది అరియామా వాదనలు వినిపిస్తున్నారు. ముగ్గురు ఎమ్మెల్యేపై వేరు వేరుగా ఫిర్యాదు చేసినా స్పీకర్ స్పందించలేదని.. నోటీసు కూడా ఇవ్వలేదన్నారు. ఒక ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ తరపున లోకసభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారని దానం నాగేందర్ గురించి ధర్మాసం దృష్టికి తీసుకొచ్చారు న్యాయవాది. ఆ తర్వాత కూడా బీఆర్ఎస్‌లోనే ఉన్నామంటున్నారని తెలిపారు. ఫిర్యాదులపై ఏం చేస్తారో... నాలుగు వారాల్లో షెడ్యూల్ చేయమని మాత్రమే హైకోర్టు గతంలో ఆదేశాలు ఇచ్చిందని.. అయినప్పటికీ స్పీకర్ పార్టీ మారిన వారికి నోటీసులు ఇవ్వలేదన్నారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసి.. విచారణ సందర్భంగా ధర్మాసనం కొన్ని వ్యాఖ్యలు చేసిన తర్వాతే నోటీసు ఇచ్చారన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13న మూడు వారాల్లో రి□`లపై ఇవ్వాలని స్పీకర్ నోటీసు ఇచ్చారన్నారు. ఇప్పటికి మూడు వారాలు అయ్యిందని.. ఆ మూడు వారాలు, నోటీసులు ఎటువెళ్లాయో తెలీదని కౌశిక్ రెడ్డి న్యాయవాది తెలిపారు. తాము ఫిర్యాదు చేసి దాదాపు ఏడాది పూర్తి అయిందని.. ఇప్పటికీ స్పీకర్ షెడ్యూల్ కూడా చేయలేదని న్యాయవాది సుందరం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే పార్టీ ఫిరాయింపులకు వార్షికోత్సవం అయ్యిందా అని న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నవ్వుతూ చెప్పారు. స్పీకర్ క్వాషి జ్యూడిషియరీ అధికారాలతో ఉన్నారని.. రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని.. రాజ్యాంగం కల్పించిన హక్కులు, అధికారాలను కూడా పరిరక్షించాల్సిన బాధ్యత స్పీకర్‌పై కూడా ఉందని న్యాయవాది సుందరం తెలిపారు. ఒకవేళ అది జరగడం లేదు అని భావిస్తే హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి కూడా రాజ్యాంగం అవకాశం కల్పించిందన్నారు. అలాంటి సందర్భంలో.. రాజ్యాంగ పరిరక్షకులుగా కోర్టులు జోక్యం చేసుకోవచ్చని చెప్పుకొచ్చారు. స్పీకర్ క్వాషీ జ్యూడిషియరీ అధికారాలతో ఒక ట్రిబ్యునల్‌గా స్పీకర్ వ్యవహరించాలన్నారు. స్పీకర్ అధికారాల్లోకి వెళ్లాలని, ఆయన వీధుల్లో జోక్యం చేసుకోవాలని కోరడం లేదని... కానీ, రాజ్యాంగ విధులు నిర్వర్తించాలని మాత్రమే తాము కోరుతున్నామన్న న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఇలాంటి వ్యవహారాల్లో ముగ్గురు, ఐదుగురు రాజ్యాంగ ధర్మాసనాలు కూడా స్పీకర్‌ను తగిన సమయం అని స్పష్టంగా చెప్పలేదన్నారు. అలాంటప్పుడు తాము వాటిని కాదని ఎలా ముందుకు వెళ్లగలమని.. ఉన్నత ధర్మాసనాల తీర్పులను తిరిగి రాయలేం కదా అంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం అభిప్రాయపడిరది. న్యాయవాది సుందరం మాట్లాడుతూ... తగిన సమయం అనే విషయంలో ఒక్కో కేసులో ఒక్కో విధంగా నిర్ణయాలు జరిగాయన్నారు. కానీ, మూడు నెలల్లో నిర్ణయం తీసుకుని అమలు చేయాలని ఒక తీర్పులో సుప్రీంకోర్టు చెప్పిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. గతంలో రాజేంద్ర సింగ్ రాణా కేసులో కోర్టు జోక్యం చేసుకుందని... కేవలం నాలుగు వారాల్లోనే నిర్ణయం కూడా జరిగి పోయిందని తెలిపారు. రాజేంద్ర సింగ్ రాణా కేసులో మూడు నెలలు కాదని.. నాలుగు వారాలే అని స్పష్టం చేయడంతో.. అనర్హత వేటు పడిరదని ఆర్యామ సుందరం వెల్లడిరచారు. మరో కేసులో... తగిన సమయం అంటే నిర్ణయం స్పీకర్ మాత్రమే తీసుకోవాల్సి ఉంటుందనిని చెప్పిందని చెబుతూ.. పాడి కౌశిక్ రెడ్డి తరపున న్యాయవాది అరియామా సుందరం వాదనలను ముగించారు. అనంతరం తదుపరి విచారణను సుప్రీం ధర్మాసనం వాయిదా వేసింది.

బీఆర్ఎస్ తరపు న్యాయవాదులు సుమారు రెండు గంటల పాటు సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ తరపు వాదనలు ముగియగా.. తదుపరి విచారణను ధర్మాసనం ఏప్రిల్ 2కు వాయిదా వేసింది.

# కేబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్

**మొదటి పేజీ తరువాయి**

పగ్గాలు చేపట్టి ఏడాదిన్నరయింది. అదిగో ఇదిగో అంటూ కేబినెట్ విస్తరణ ఆశవహులను ఊరిస్తూనే ఉంది. ప్రస్తుతం సీఎం సహా 12 మంత్రులు వున్నారు. లెక్క ప్రకారం కేబినెట్‌లో మరో ఆరుగురికి చోటు వుంటుంది. రెండు పెండిరగ్‌లో పెట్టాలనే నిర్ణయం జరిగినట్టు చర్చజరుగుతోంది.ఆ లెక్కన మంత్రి పదవి దక్కనున్న ఆ నలుగురు ఎవరన్నది ఆసక్తికరంగా మారిందిప్పుడు. సామాజిక సమీకరణాల ప్రకారం ఎస్టీ లంబాడకోటాలో తనకు మంత్రి పదవి ఇవ్వాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ తన ఆవాజ్ విన్పించడం సహా సీనియర్ నేత జానారెడ్డి అండందండలతో గట్టిగా ప్రయత్నాలు చేశారనేది టాక్.. అల్రెడీ నల్లగొండ జిల్లా నుంచి కేబినెట్‌లో రెడ్డి సామాజిక వర్గం నుంచి ఇద్దరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఫిర్‌బీ తనకు చాన్స్ పక్కా అనే ధీమాతో ఉన్నారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. మరోవైపు వివేక్ వెంకటస్వామి, పెద్దల సభ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతికి అవకాశం వుండొచ్చనే ప్రచారం తెరపైకి రానే వచ్చింది. ప్రొఫెసర్ కోదండరామ్ పేరు కూడా పరిశీలనలో ఉందనే ప్రచారం జరిగింది. ఇక మంత్రి పదవి లేకపోవడం వల్లే రంగారెడ్డి జిల్లాకు అన్యాయం జరుగుతుందంటూ తనకు కేబినెట్‌లో చోటివ్వాలని చెప్పకనే చెప్పారు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి .తనకు చాన్స్ ఇవ్వకపోతే రాజీనామా చేస్తానంటూ అలకాస్త్రం కూడా ప్రయోగించారు.. ఇక మైనార్టీ కోటా నుంచి కూడా కాంపిటేషన్ ఎక్కువగానే ఉంది. లైన్‌లో అలా ఎందరో ఆశవహులు ఉన్నారు. మరి వారిలో కేబినెట్ బెర్త్ చేజిక్కించుకునే ఆ నలుగురు ఎవరు? ఉగాది తెలంగాణ కేబినెట్ విస్తరణ ఖాయమనే సంకేతాలయితే వచ్చేశాయి. మరోవైపు ఏప్రిల్ 8,9న గుజరాత్‌లో జరిగే ఏఐసీసీ సమావేశాల కోసం రణదీప్ సూర్జేవాల నేతృత్వంలో 15 మందితో కమిటీ నియమించారు. అందులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు చోటు దక్కింది. మరి ఉగాది వేళ మంత్రిగిరికి సంబంధించి తీపి కబురు ఎవరికి? టఫ్ కాంపిటేషన్ నేపథ్యంలో రాజపూజ్యంఅవమానాలు..అసంతృప్తులు ఏ రేంజ్‌లో ఉంటాయోననే దానిపై కాంగ్రెస్ పార్టీలో చర్చ మొదలైంది.

# ప్రసాదాలపై జీఎస్టీ ఎత్తివేత

- **పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఐటీ బిల్లు**
- **సెలెక్ట్ కమిటీ ముందుకు నివేదిక**
- **ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ వెల్లడి**

**ప్రజాక్షేత్రం, న్యూఢిల్లీ, మార్చి25:**

కొత్త ఆదాయపు పన్ను బిల్లును పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో చర్చకు చేపట్టనున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రకటించారు. లోక్‌సభలో ఆర్థిక బిల్లు 2025పై చర్చలకు నిర్మలా సీతారామన్ సమాధానంఇస్తూ, ఫిబ్రవరి 13న సభలో ప్రవేశపెట్టిన కొత్త ఆదాయపు పన్ను బిల్లును ప్రస్తుతం సెలెక్ట్ కమిటీ పరిశీలిస్తోందని తెలియజేశారు. సెలెక్ట్ కమిటీ తన నివేదికను పార్లమెంట్ తదుపరి సమావేశాల మొదటి రోజు సమర్పించవలసి ఉంది. 'మేము దానిని వర్షాకాల సమావేశాల్లో చేపడతామని మంత్రి తెలిపారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సాధారణంగా జూలైలో మొదలై ఆగస్టు వరకు సాగుతుంటాయి. కొత్త ఆదాయపు పన్ను బిల్లు ఆమోదం పొందిన తరువాత డిజిటల్ రికార్డును కూడా మదింపునకు పరిగణనలోకి తీసుకోనున్నట్లు సీతారామన్ చెప్పారు. 1961 చట్టంలో డిజిటల్ ప్రస్తావన లేనందున అది తరచు వివాదాస్పదం అవుతోందని, జనం కోర్టును ఆశ్రయించి, పాస్‌కోడ్‌ను పంచుకోకుండా రక్షణ కోరుతున్నారని ఆమె తెలిపాను. 'అందువల్ల డిజిటల్ ఒక వివాదంగా మారుతోంది. ఇప్పుడు ఉన్న ఆ లోటును కొత్త ఆదాయపు పన్ను బిల్లులో భర్తీ చేస్తున్నాం. బిల్లు సెలెక్ట్ కమిటీ ముందు ఉందని ఆమె చెప్పారు. తనిఖీ, స్వాధీనం కేసుల్లో ఆన్‌లైన్ ట్రేడిరగ్, పెట్టుబడి ఖతాలు సహా వర్చువల్ డిజిటల్ స్పేస్, కంప్యూటర్ సిస్టమ్‌ల అందుబాటు కోడ్‌ను అధిగమించే అధికారాలను పన్ను అధికారులకు కొత్త బిల్లు దత్తం చేస్తుంది. 1961 ఆదాయపు పన్ను చట్టం పరిమాణంలో సగం ఉన్న సరళీకృత ఆదాయపు పన్ను బిల్లు దావా అవకాశాన్ని, కొత్త అన్వయాన్ని కనిష్ఠ స్థాయికి చేర్చడం ద్వారా పన్నును కచ్చితత్వం చేస్తుందని ఆదాయపు పన్ను శాఖ ఇంతకు ముందు తెలియజేసింది. తయారీ రంగానికి ఊతం ఇచ్చేందుకు, ఎగుమతులను ప్రోత్సహించేందుకు, సామాన్యులకు ఉపశమనం కలిగించేందుకే కస్టమ్స్ సుంకాలను హేతుబద్ధీకరిస్తామని నిర్మలాసీతారామన్ వివరించారు. వస్తు, సేవల పన్ను నుంచి ప్రసాదాన్ని మినహాయిస్తున్నట్లు మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడిరచారు. ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లో విక్రయించే ప్రసాదాలకు ఎలాంటి జీఎస్టీ వర్తించబోదని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ ప్రకటనలపై ఈక్వలైజేషన్ లెవీ లేదా డిజిటల్ పన్ను ను కూడా రద్దు చేయనున్నట్లు ప్రకటించారు. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల్లో అస్థిర పరిస్థితులను తొలగించే క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. లోక్‌సభలో ఆర్థిక బిల్లు 2025 కి ప్రతిపాదించిన 59 సవరణల్లో ఇదీ ఉంది. ఏప్రిల్ 2 నుంచి భారత్‌పై ప్రతీకార సుంకాలను విధిస్తామని అమెరికా బెదిరిస్తున్న నేపథ్యంలో.. గూగుల్, మెటా, ఎక్స్ వంటి సంస్థలకు అనుకూలంగా ఉండేలా ఆన్‌లైన్ ప్రకటనలపై ఈక్వలైజేషన్ లెవీ తొలగించాలనే ప్రతిపాదన తీసుకొచ్చినట్లు నిపుణులు భావిస్తున్నారు. అనంతరం ఈ ఆర్థిక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది.

## ఏఐసీసీ భేటీల ముసాయిదా కమిటీ సభ్యుడిగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క .

**అభినందనలు తెలియజేసిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు**

**ఖమ్మం,మార్చి 25 (ప్రజాక్షేత్రం):**గుజరాత్ లోని అహ్మదాబాద్ లో ఏప్రిల్ 8,9 తేదిల్లో నిర్వహించబోయే ఏఐసీసీ సమావేశాలకు కాంగ్రెస్ అధిష్టానం ముసాయిదా కమిటీని నియమించింది.ఈ కమిటీ లో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కి అదిష్టానం అవకాశం కల్పించడం పట్ల రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేస్తు..భట్టి విక్రమార్క కి అభినందనలు తెలిపారు.



## ఎదులాపురం అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్

**ఖమ్మం,మార్చి 25 (ప్రజాక్షేత్రం):**మంగళవారం ఎదులాపురం మున్సిపాలిటీ, ఎదులాపురం నందు గల అంగన్వాడి కేంద్రం ను జిల్ల కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్ సందర్శించి అక్కడున్న సమస్యలు అంగన్వాడి టీచర్ మేళ్ళ చెరువు.దుర్గమ్మ ను అడిగి తెలుసుకొని స్కూల్ పిల్లలకు ఫ్యాన్ లేక ఇబ్బందులు పడుతున్నారు అని అన్నారు.అలాగే స్కూల్ కిటికీలకు టవర్ బోల్ట్ లు సరిగా పడకపోవడం వలన కిటికీలో నుండి విషసర్పాలు వస్తున్నాయి అని టీచర్ చెప్పగా వెంటనే స్పందించి తన సొంత నిధులతో కొత్త ఫ్యాన్ మరియు టవర్ బోల్టు కార్పెంటర్ ద్వారా రిపేర్ చేయించడం జరిగింది.అలాగే స్కూల్ ఆవరణ లోని పిచ్చి మొక్కలను మరియు గడ్డి నీ తొలగించాలని కోరగా వెంటనే స్పందించి సంబంధిత ఎదులాపురం మున్సిపల్ అధికారి కి చెప్పగా వారు వెంటనే స్కూల్ ఆవరణ లోని పిచ్చిమొక్కలు మరియు గడ్డిని .పారిశుధ్య కార్మికుల ద్వారా వెంటనే శుభ్రపరచడం జరిగింది.ఈ సందర్భంగా అడిగిన వెంటనే సమస్యలను తీర్చినందుకు అంగన్వాడి టీచర్ మరియు ఆయా లు సురేష్ నాయక్ కు కృతజ్ఞతలు తెలిపారు.వారితో పాటు పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ డైరెక్టర్ నాగార్జునపు.ప్రద్యుమ్న చారి,మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు కళ్లెం.శేష్ రెడ్డి, మెళ్ళచెరువు.బ్రహ్మం, రవీంద్రా,నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## ఆవిష్కర్త అవార్డు పొందిన రైతుకు ప్రత్యేక అభినందనలు తెలిపిన పెద్దపల్లి అదనపు కలెక్టర్ డి.వేణు

**పెద్దపల్లి,మార్చి25(ప్రజాక్షేత్రం):**

ఆవిష్కర్తగా జాతీయస్థాయి సంస్థ నుంచి అవార్డు పొందిన రైతు మల్లారెడ్డి ని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణు అభినందించారు.పెద్దపల్లి మండలం కాసులపల్లి గ్రామానికి చెందిన ఎర్రం మల్లారెడ్డి డ్రం సీడర్ పద్ధతితో విత్తనాలు జల్లడం,ఇతర ఆధునిక పద్ధతులను పాటించి అత్యధికంగా వారి దిగుబడులు సాధించిన నేపథ్యంలో న్యూఢిల్లీకి చెందిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ సంస్థ ఇన్నోవేటర్ ఫార్మర్ గా ఎంపిక చేసి అవార్డు అందించడం జరిగింది.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంబంధిత రైతును అభినందించి,ఆధునిక పద్ధతులను ఇతర రైతుల కూడా పాటించి అధిక దిగబడులు సాధించాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి,సంబంధిత రైతు,తదితరులు పాల్గొన్నారు.



## క్యాన్సర్ బాధితుడి మాటలకు మంత్రి శ్రీధర్ బాబు కన్నీళ్లు.!

- **భాధితుని కోరిక మేరకు క్రికెట్ కిట్ అందజేత.**
- **అన్నగా అండగా ఉంటానని భరోసా.**



**మంథని,మార్చి25(ప్రజాక్షేత్రం):** సార్,నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. పెద్ద క్రికెటర్ కావాలని కలగన్నా నాకో క్రికెట్ కిట్ ఇప్పించండి సార్ అంటూ క్యాన్సర్ తో పోరాడుతున్న ఓ యువకుడి మాటలివి.వింటే మనసున్న ప్రతీ మనిషికీ గుండె చెమర్చక మానదు.ఈ మాటలకే రాష్ట్ర ఐటి పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఏకంగా కన్నీళ్లు పెట్టుకున్నారు.మంథని నియోజకవర్గం పలిమల మండలం సర్వాయి పేట గ్రామానికి చెందిన భౌత్ నితిన్ క్యాన్సర్ తో బాధపడుతూ ఖాజగూడలోని స్పర్ష్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు.ఈ విషయం తెలుసుకున్న మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు స్వయంగా ఆసుపత్రికెళ్లి పరామర్శించాడు.నేనున్నానని భరోసానిచ్చాడు.ఈ సందర్భంగా నితిన్ మాటలకు కన్నీళ్లు పెట్టుకున్న శ్రీధర్ బాబు అప్పటికప్పుడు క్రికెట్ కిట్ తెప్పించి అతని కోరికను నెరవేర్చారు. సొంతన్నగా వెంట నిలుస్తానని,ఏ అవసరమున్నా నేరుగా నన్ను సంప్రదించండి అంటూ నితిన్ తల్లి దండ్రులకు మంత్రి ధైర్యం చెప్పాడు.

# మున్సిపల్ ఆదాయం పెంచుకొని పట్టణాభివృద్ధికి కృషి చేయాలి.

- **పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**
- **100శాతం పన్నుల వసూలుకు ప్రత్యేక కార్యాచరణ.**
- **వాస్తవిక బడ్జెట్ లను రూపొందించి వాటి అమలుకు కృషి చేయాలి.**
- **ఆదాయం పెంచుకునేలా పట్టణాలలో పన్నుల రీ-అసిస్మెంట్ చేయాలి.**
- **3 మున్సిపాలిటీలు,రామగుండం కార్పొరేషన్ బడ్జెట్ తయారీపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్.**



**పెద్దపల్లి,మార్చి25(ప్రజాక్షేత్రం):** అనవసర ఖర్చులు తగ్గించి,మున్సిపల్ ఆదాయాన్ని పెంచుకొని పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం సమీకృత కలెక్టరేట్ లో 3 మున్సిపాలిటీలు,రామగుండం కార్పొరేషన్ బడ్జెట్ తయారీపై అదనపు కలెక్టర్ అరుణ శ్రీ తో కలిసి సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించాడు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఆదాయ వనరుల పై కౌన్సిల్ సమావేశంలో చర్చ నిర్వహించి ఆదాయాన్ని పెంచుకునేందుకు తీసుకోవలసిన చర్యల పై దృష్టి సారించాలని అన్నారు.మున్సిపల్ పరిధిలో ఆదాయాన్ని పెంచుకున్నప్పుడే మన వార్డులు డివిజన్లలో మరింత అభివృద్ధికి అవకాశం ఉన్నదని తెలిపారు.మున్సిపల్ ఆదాయం పెంచుకున్న సందర్భంలో మనకు కావాల్సిన అభివృద్ధి సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు.ప్రతి వార్డులో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ 100శాతం పన్ను వసూలకు ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ అన్నారు.ప్రస్తుతం పట్టణాలను సుందరంగా,ప్రజల సౌకర్యార్థం అభివృద్ధి చేసుకోవడం జరుగుతుందనీ,ఇంకను ఆదాయ మార్గాలు పెంచుకున్నప్పుడు పలు రకాల,మరింతగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చని తెలిపారు.పట్టణాలలో ఆదాయం మార్గాలు పెంచుకునేందుకు పన్నుల అవసరమైన చోట రీ అసెస్మెంట్ చేయాలని కలెక్టర్ సూచించారు. వ్యయాలు తగ్గించుకుంటూ,ఆదాయాన్ని జాగ్రత్తగా వాడుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమృద్ధిగా అందుబాటులో ఉండే విధంగా కృషి చేయాలనీ తెలిపారు.పట్టణాలలో ప్రాధాన్యత ప్రకారం పనులు చేపట్టాలని,ప్రజల మౌలిక వసతుల కల్పన పనులకు ముందుగా బడ్జెట్ కేటాయింపులు ఉండాలని అన్నారు.ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్లు,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందు సోదర భావాన్ని పెంపొందిస్తుంది : ఆశీర్వాదం

**శంకర్ పల్లి మార్చి 25(ప్రజాక్షేత్రం):**

శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలో మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగింది.సోదర భావాన్ని పెంపొందిస్తుంది అని ఎంఈఎఫ్ సలహాదారుడు ఆశీర్వాదం అన్నారు. మంగళవారం శంకర్ పల్లి లో ముస్లిం ఉపాధ్యాయులు ఎంఈఓ అక్బర్, సలీం పాషా, ఆరీఫ్, అశ్రఫ్ ఖాన్, తహర్, రియాజ్ లకు ఎంఈఎఫ్ పక్షాన ఇఫ్తార్ విందు ఇవ్వడం జరిగింది. వారు మాట్లాడుతూ ఆనాటి నుండి మాదిగలు, ముస్లిమ్ లు సోదరాభావం తో అన్నదమ్ముళ్లగా కలిసి ఉన్నామని హిందూ ముస్లిమ్ పండుగలను కలిసి మెలిసి చేసుకునే వాళ్ళమని యంఈఎఫ్ సోదరులు మాకు అతీద్యం ఇవ్వడం ఆనంద దయాకమని అన్నారు. ఈ కార్యక్రమం ఎంఈఎఫ్ మండలం అధ్యక్షులు జామ కుషాల్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి కిష్టయ్య, ప్రధానోపాధ్యాయులు గోపాల్, లక్ష్మయ్య, సలహాదారులు



అశోక్ కానిస్టేబుల్, జంగయ్య, లక్ష్మణ్, పర్మన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో గ్రామాలు ఆగమైతున్నయ్

- **అభివృద్ధి లేకున్నా పన్నులు ఎందుకు కట్టాలని ప్రశ్న**
- **స్థానిక ఎన్నికలు ఎప్పడో ప్రభుత్వానికే తెలియదు.**
- **డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు.**

**కాగజ్ నగర్ మార్చి 25(ప్రజాక్షేత్రం):**గత 15 నెలల కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో పాలన సాగక ఆగమైతున్నాయని, సర్పంచ్ లు లేక ,నిధులు రాక అభివృద్ధి జరగక ప్రజలు అవస్థలు పడుతున్నారని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. మంగళవారం కాగజ్ నగర్ మండలంలోని భట్ పల్లి గ్రామంలో పర్యటించిన ఆయన గ్రామస్థులను కలిసి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. గ్రామాల్లో గత 15 నెలలుగా సర్పంచ్ లు లేకపోవడంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధులు రాక,కనీసం వీధి లైట్లు పెట్టే పరిస్థితి లేదన్నారు. గ్రామాల్లో మురికి కాల్వలు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. గ్రామ పంచాయితీ ట్రాక్టర్లకు డీజిల్ పోసే దిక్కులేదన్నారు. పారిశుధ్య కార్మికులకు కూడా సరైన సమయంలో జీతాలు రాక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి గ్రామాలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఇప్పటి వరకు స్థానిక సంస్థల ఎన్నికలు ఎపుడుంటాయో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా క్లారిటీ లేదని విమర్శించారు. ఎలాంటి వసతులు లేకపోయినా ప్రతి నెలా పన్నులు మాత్రం క్రమం తప్పకుండా వసూలు చేస్తున్నారని, గ్రామస్థులు సౌకర్యాలు కల్పించకపోతే పన్నులు ఎందుకు చెల్లించాలని నిలదీశారు. తుంగమడుగు గ్రామస్తులను కలిసి వారి సమస్యలు తెలుసుకొన్నారు. అక్కడ అంగన్ వాడీ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని మాటిచ్చారు. తుంగమడుగు గ్రామానికి రోడ్డు వేయడం ఎమ్మెల్యేకు చేతకావడం లేదన్నారు. గెలిచిన ఆరు నెలల్లో రోడ్డు వేయిస్తానని చెప్పి, గెలిచిన తర్వాత ఎమ్మెల్యే గ్రామానికి కూడా రావట్లేదన్నారు. గత ఎమ్మెల్యే కోనప్ప కొబ్బరికాయలు కొట్టి ప్రజలకు ఆశ జూపి వదిలేశారని ఎద్దేవా చేశారు. నెల రోజుల్లో ఆ గ్రామానికి రోడ్డు వేయకుంటే వందలాది మందితో నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. అకాల వర్షాల వల్ల పంట నష్టం జరిగిన రైతులకు ఎన్ని రోజుల్లో ఎకరానికి ఎంత పరిహారం చెల్లిస్తారో అసెంబ్లీ వేదికగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రాజ్ కుమార్ యాదవ్, కాశపాక రాజు, అంజన్న, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



## పెద్దపల్లి లో మార్చి 27న జాబ్ మేళా నిర్వాహణ.

**జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు.**

**పెద్దపల్లి,మార్చి25(ప్రజాక్షేత్రం):**జిల్లాలోని నిరుద్యోగ యువకులకు అపోలో ఫార్మసీలో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 27న గురువారం రోజున సమీకృత జిల్లా కలెక్టరేట్లో రూమ్ నెంబర్ 225 నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పెద్దపల్లి జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతి రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.అపోలో ఫార్మసీ సంస్థలో 50 ఫార్మసిస్ట్,ట్రైనీ ఫార్మసిస్ట్,ఫార్మసీ అసిస్టెంట్,రిటైల్ ట్రైనీ పోస్టు ఖాళీగా ఉన్నాయని,ఫార్మసిస్ట్ ట్రైనింగ్ ఫార్మసిస్ట్ పోస్టులకు బీఫార్మసీ లేదా ఫార్మసీ డిప్లమా,ఫార్మసీ అసిస్టెంట్,రిటైల్ ట్రైనీ పోస్ట్ లకు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని,వీరి వయస్సు 18 నుంచి 35 లోపు ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు మార్చి 27న ఉదయం 11 గంటలకు సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో సమీకృత జిల్లా కలెక్టరేట్ కు వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని,మరిన్ని వివరాలకు 8247656356,8985336947,8121262441 నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు ఆ ప్రకటనలో తెలిపారు.




## గద్దర్ గళం అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం.

**గోదావరిఖని,మార్చి25(ప్రజాక్షేత్రం):** వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ (వి.ఎస్.ఎస్.ఎస్) వారి ఆధ్వర్యంలో విశ్వవసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఉభయ తెలుగు రాష్ట్రాలలోని కవులకు,రచయితలకు,గాయకులకు,కళాకారులకు గద్దర్ గళం అవార్డ్స్ తో పాటు,పలు రంగాలలో సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు,పండితులకు ,సంగీత,సాహిత్య,నృత్య, చిత్రలేఖన,శిల్ప,జానపద,మిమిక్రీ,ఇంద్రజాల,హరికథ,బురక్రథ,ఒగ్గుకథ,కోలాటం విద్య,వైద్య రంగాలలో సేవలందిస్తున్న వారికి జాతీయస్థాయి మానవత వెలుగు అవార్డ్స్ 2025 ఉగాది పురస్కారాల ప్రధానోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరిగుతుందని వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్,లయన్ డాక్టర్ సురభి శ్రీధర్ తెలిపాడు .ఈ పురస్కారాలకు దరఖాస్తులు చేసుకునేవారు ఏప్రిల్ 15 లోపు దరఖాస్తు చేసుకోవాలని మరిన్ని వివరాలకు 8977748838 నెంబర్ ను సంప్రదించాలని సురభి శ్రీధర్ తెలిపారు.




## లైసెన్స్ లేకుండా నడుపుతున్న పెట్రోల్ బంక్ సీజ్.

- **జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేందర్.**
- **కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని భార్గవి సర్వీస్ స్టేషన్ ను సీజ్ చేసిన అధికారులు.**

**కాల్వ శ్రీరాంపూర్,పెద్దపల్లి,మార్చి25(ప్రజాక్షేత్రం):**లైసెన్స్ లేకుండా నడుపుతున్న పెట్రోల్ బంక్ ను సీజ్ చేస్తున్నట్టు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేందర్ తెలిపారు.సోమవారం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేందర్ కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని భార్గవి సర్వీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ నిర్వహించి లైసెన్సు లేని కారణంగా సీజ్ చేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ తనిఖీలలో భార్గవి సర్వీస్ స్టేషన్ (యజమాని వి.రమేష్) ఫారం బీ లైసెన్స్ లేకుండానే వ్యాపారం చేస్తున్నట్లు గమనించి సీజ్ చేశామని అన్నారు.పెట్రోల్ బంక్ లో 20 లక్షల 37 వేల 248 రూపాయల విలువ గల ఉన్న 9992 లీటర్ల పెట్రోల్,10,022 లీటర్ల డీజిల్ లను కూడా సీజ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ తనిఖీలలో డిప్యూటీ తహసిల్దారులు సంతోష్ సింగ్ ఠాగూర్,రవీందర్,సంబంధిత అధికారులు,తదితరులు జిల్లా పౌర సరఫరాల అధికారి వెంట ఉన్నారు.



## మిషన్ భగీరథ నీళ్లు లేక ఇబ్బందులు

**ఇదే నిజం, ఆసిఫాబాద్:** కొమరం బీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గం కౌటాల మండలంలోని తలోడి గ్రామ పంచాయితీ లో ని బీసీ కాలనిలో దాదాపు 100కుటుంబాలు ఉన్నాయని, మిషన్ భగీరథ నీళ్లు గత సంవత్సరాలనుండి రావడం లేదని తెలిపారు. కొంతమంది కాలనీలో ప్రభుత్వ బావి ఉన్న దాన్ని కూడా ఆక్రమించుకున్నారని, జీపీ ఫౌండ్ అంత అవినీతి అక్రమాలకు గురైందని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తలోడి గ్రామ బీసీ కాలని వాసులకు మిషన్ భగీరథ నీళ్లు సరఫరా చేయగలరని వేడుకుంటున్నారు.

## అఘోరీతో వెళ్ళిన బీటెక్ యువతి... మరో లేడీ అఘోరీగా మారబోతుందా?

**హైదరాబాద్, మార్చి 25(ప్రజాక్షేత్రం):** తెలుగు రాష్ట్రాల్లో లేడీ అఘోరీ గురించి తెలియని వారు ఉండరు. ఆ మధ్య ఆమె వరుసగా ఆలయాలకు వెళ్లి అక్కడ నానా హంగామా చేసింది. అయితే కొద్దిరోజులుగా ఆమె పెద్దగా కనిపించడం లేదు. అయితే తాజాగా గుంటూరు జిల్లా మంగళగిరిలో బిటెక్ చదువుతున్న విద్యార్థిని అఘోరీగా మారటానికి ఇంటిలో నుంచి వెళ్ళిపోవడం కలకలం రేపుతోంది. ప్రియదర్శిని కాలేజ్ లో బిటెక్ చదివిన విద్యార్థినికి కొన్ని రోజుల క్రితం మంగళగిరికి వచ్చిన లేడీ అఘోరీతో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత కొద్దీ రోజుల పాటు విద్యార్థిని ఇంట్లోనే అఘోరీ బస చేసింది. ఆ క్రమంలో అఘోరికీ, యువతికి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. రెండు రోజుల క్రితం మేజర్ అయిన యువతి తాను అఘోరీగా మారటానికి హైదరాబాద్ వెలుతున్నట్లు పోలీసులకు చెప్పి వెళ్ళింది. తాను మేజర్‌ను అని, అయితే తన తల్లిదండ్రులకు తాను అఘోరీగా మారటం ఇష్టం లేదని దీంతో ఇల్లు విడిచి వెళ్ళిపోతున్నట్లు చెప్పింది. తండ్రి కోటయ్య పోలీసులను ఆశ్రయించాడు. తన కూతురు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే అంతకుముందే ఆ యువతి పోలీసులకు తాను వెళ్ళిపోతున్నట్లు చెప్పడంతో అదే విషయాన్ని పోలీసులు తల్లిదండ్రులుకు చెప్పారు. దీంతో వారు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ తమ కూతురిని ఆఘోరి వశపరుచుకుందని ఆరోపించారు. అఘోరి చెర నుంచి తమ కూతురును విడిపించి తమకు అప్పగించాలని వేడుకుంటున్నారు.



## లక్కారంలో శ్రీ కోదండ రామాలయం ద్వితీయ వార్షికోత్సవం వేడుకలు.

**ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎంపీపీ అత్తే చంద్రమౌళి దంపతులు.**

**ముత్తారం,మార్చి25(ప్రజాక్షేత్రం)** ముత్తారం మండలంలోని లక్కారం గ్రామంలో శ్రీ కోదండ రామాలయం ద్వితీయ బ్రహ్మోత్సవ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు.భక్తి శ్రద్ధతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.ముత్తారం మండల మాజీ ఎంపీపీ అత్తే చంద్రమౌళి లలిత దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.గ్రామస్తులతో పాటు మండలంలోని ప్రజలంతా సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అత్తే చంద్రమౌళి,మాజీ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి,మదాసీ రమేష్, దొంతరవేన రాజయ్య,వీరగోని సారయ్య,వీరగోని రాజేశం,ఆరే సంజీవ్,సాతిని బాలయ్య,ఆరే లక్ష్మయ్య,కాశీపేట మధునయ్య,నాగుల మల్యాల మల్లేశం,రామగిరి రాజబాబు,బర్ల రాజగట్టయ్య,బర్ల శ్రీనివాస్,మదాసీ రాకేష్,గోపిషెట్టి వేణు,మదాసి సంతోశ్ గ్రామస్తులు పాల్గొన్నారు.



## విజయవాడ కనకదుర్గను దర్శించుకున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్.

**పెద్దపల్లి,మార్చి25(ప్రజాక్షేత్రం):**

విజయవాడ కనకదుర్గ అమ్మవారిని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి ఈశ్వర్ కు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వెంట మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్,పుట్ట మధుకర్, లోక బాపు రెడ్డి,మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్,హరి చరణ్ రావు,ఓరుగంటి రమణారావు,ముత్యాల బలరాం రెడ్డి,మాధవ రావు,రాజసుమన్ రావు,సాగి శ్రీనివాస్,మారం జలెంధర్,గంగాధర్ రావు,దూలం సంపత్ లు ఉన్నారు.



## విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించేందుకు పోటీలు

**బెజ్జంకి మార్చి25(ప్రజాక్షేత్రం) :** విద్యార్థులలో దాగి ఉన్న సామర్థ్యాలను, సృజనాత్మకతను వెలికి తీసేందుకు పోటీలు విద్యార్థులకు ఎంతో దోహదపడతాయని మండల విద్యాధికారి మహతి లక్ష్మి అన్నారు. మంగళవారం బెజ్జంకి మండల వనరుల కేంద్రంలో మండల స్థాయిలో ప్రాథమిక పాఠశాల నుండి ఎఫ్ ఎల్ ఎన్ పోటీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు ,ఇంగ్లీషు, సబ్జెక్టులలో విద్యార్థులలో దాగి ఉన్న సామర్థ్యాలను, సృజనాత్మకతను వెలికి తీయడానికి ప్రతి పాఠశాల నుండి రెండవ తరగతి, నాలుగో తరగతి విద్యార్థులకు భాషణం, మౌఖిక ,లేఖనం సామర్థ్యాలను పరీక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వడ్లకొండ శ్రీనివాస్ , సుధాకర్ రెడ్డి, శ్రీరాం శ్రీనివాస్ , సుచరిత, ఉపాధ్యాయులు పుల్లూరి ప్రభాకర్, రజనీష్, నరసింహారెడ్డి, తిరుపతి, రామంచ రవీందర్, నారోజు శంకరాచారి ,సత్యం ,వేణు సత్యం వేణు తిరుపతి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




### ప్రైవేట్ హాస్పటల్లో ప్రభుత్వ నిబంధనలు ప్రకారమే

# ఫీజులు తీసుకోవాలి.

- పెద్దపల్లి జిల్లా వైద్యాధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి.
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు.
- పెద్దపల్లిలో పలు ఆస్పత్రులను తనిఖీ చేసిన డిఎం అండ్ హెచ్ఓ.

**పెద్దపల్లి,మార్చి25(ప్రజాక్షేత్రం):**

ప్రైవేటు హాస్పిటల్ లో ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారమే ఫీజులు తీసుకోవాలని పెద్దపెల్లి జిల్లా వైద్యాధికారి డాక్టర్ అన్నప్రసన్నకుమారి తెలిపారు.పెద్దపల్లి టౌన్ లోని ప్రైవేట్ డయాగ్నోసిస్ కేంద్రాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.శాంతి నగర్ లోని లక్ష్మి శ్రీనివాస డయాగ్నొస్టిక్ అండ్ ఇమేజింగ్ సెంటర్,కమాన్ రోడ్ లైన్ లో గల ప్రైమ్ డయాగ్నొస్టిక్ సెంటర్ లలో తనిఖీలు నిర్వచించారు.రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి గత తేదీలలోని ఇమేజింగ్ లను చూశారు."పుట్టబోయేది ఆడబిడ్డా,మగ బిడ్డా అని ఇక్కడ చెప్పబడదు అది చట్ట రీత్యా నేరం" అని బోర్డులు అందరకి కనపడేలా పెట్టాలని అన్నారు.నక్షత్ర కంటి దవాఖానా, మల్లికార్జున హాస్పిటల్,తిరుమల హాస్పిటల్,అనీస్ హోమియో క్లినిక్ లను తనఖీ చేశారు.చిన్న చిన్న లోపాలు ఉంటే సరిచేసుకోవాలని నిబంధనలకు వ్యతిరేకంగా నడిపిస్తే అట్టి వాటికి నోటీసు ఇస్తాం అని అన్నారు.ప్రభుత్వ ప్రైస్ లిస్ట్ ప్రకారం మాత్రమే ఫీజు తీసుకోవాలి అని అన్నారు.అగ్నిమాపక చర్యలో భాగంగా ఫైర్ ఎక్స్టి ంగ్ విషర్ లను గోడకు బిగించాలని వాటిలోని




గ్యాస్ ను ఎక్స్పైర్ కాగానే కొత్త గ్యాస్ నింపించాలన్నారు.బయో మెడికల్ వేస్టేజ్ ను ప్రాపర్ గా డిస్పోజ్ చేయాలని,క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం ప్రకారం నిబంధనలు పాటించాలని లేనిచో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కెసిఆర్ పై తప్పుడు ఆరోపణలు చేసిన బండి సంజయ్ పై చర్యలు తీసుకోవాలి..!

- మండల మాజీ రైతుబంధు అధ్యక్షుడు ఖాజాపాషా.
- బంటారం పిఎస్ లో ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు.

**బంట్వారం మార్చ్ 25 (ప్రజా క్షేత్రం):** బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపకుడు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పై తప్పుడు ఆరోపణలు చేసిన బండి సంజయ్ పైన చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ బంటారం మండలం మాజీ రైతు బంధు అధ్యక్షుడు ఖజపాషా పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం బంట్వారం పోలీస్ స్టేషన్ లో మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు బండి సంజయ్ పై పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో దొంగ నోట్లు ప్రింటింగ్ చెలామని చేశారంటూ, స్థాయిని మరిచి నిరాధారణ వాక్యాలతో కెసిఆర్ ప్రతిష్టను దెబ్బతిసేలా మాట్లాడి ప్రజలకు తప్పుడు సాంకేతలు ఇస్తున్న కేంద్ర సహాయ మంత్రి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల మాజీ రైతు బందు అధ్యక్షులు ఖాజాపాషా, మండల ప్రధాన కార్యదర్శి అల్లాపూరం శ్రీనివాస్, మబ్బు రాజు, ఎర్ర ఆనంతి, మౌలాన, సుదర్శన్, అశోక్, ఎం కె పి ఖాదీర్ పాషా, కుదురత్, రావుల నర్సిములు, డాక్టర్ నర్సిములు తదితరులు పాల్గొన్నారు.




## సైబర్ క్రైమ్ పోలీస్ ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై అవగాహన సదస్సు.

**రామగుండం,పెద్దపల్లి,మార్చి25(ప్రజాక్షేత్రం)** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు రామగుండం వీటీసీ (ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్) గోదావరిఖనిలో సైబర్ నేరాలపై,సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెడ్ కానిస్టేబుల్ ఏ. శంకర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు బెట్టింగ్ లు,డిజిటల్ అరెస్ట్,మల్టీలెవెల్లింగ్ మార్కెటింగ్,అడ్వర్టైజ్మెంట్ ఫ్రాడ్స్,ఫెడెక్స్ కొరియర్ ఫ్రాడ్స్,లోన్ యాప్ ల,ఓటీపీ,ఓఎల్ఎక్స్ ఫ్రాడ్స్ ల గురించి www.cybercrime.gov.in,సైబర్ ట్రోల్ ఫ్రీ నెంబర్ 1930 ల ప్రాముఖ్యత గురించి తెలిపారు.ఆన్లైన్ మోసాలపై అడ్డుకట్ట వేయుటకు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ప్రస్తుత సమాజంలో సెల్ ఫోన్ వలన ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో,అన్ని అనర్థాలు కూడా జరుగుతున్నాయని,సెల్ ఫోన్ వినియోగం పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు.ఆండ్రాయిడ్ ఫోన్ ఉపయోగం పెరగడంతో సైబర్ మోసాలు పెరుగుతున్నాయని మోసగాళ్ల ఉచ్చులో పడి నష్టపోకుండా ఉండాలని తెలిపారు.ఎవరైనా సైబర్




నేరగాళ్ల చేతిలో మోసపోయిన వెంటనే సైబర్ నేరాల గురించి 1930 అనే టోల్ ఫ్రీ నెంబర్ లేదా https://cybercrime.gov.in/ ద్వారా ఫిర్యాదు చేయాలని బ్యాంక్ కస్టమర్ లకు సూచించారు.ఈ అవగాహన కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అట్టెం శంకర్,శేక్ రియాజ్,పెద్దల సంతోష్,కానిస్టేబుల్స్ కీర్తి వెంకటేష్, తిరుపతి,నిమ్మతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదులపై దాడులను అరికట్టడానికి ప్రభుత్వం రక్షణ చట్టాలని ఆమోదించాలి

**లాయర్స్ ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ నర్రి స్వామి**

**హైదరాబాద్,మార్చి 25(ప్రజాక్షేత్రం):** హైదరాబాదులో ప్రాక్టీసింగ్ న్యాయవాది ఇజ్రాయిల్ నీ ఉదయమే హత్య చేయడం తీవ్రంగా ఖండించదగిన విషయం.ఈ హత్యకు నీరసంగా అన్ని కోర్టులలో న్యాయవాదులు నిధులను బహిష్కరించి న్యాయవాదులకు రక్షణ చట్టాలు కావాలని నిరసన తెలియజేస్తున్నారు. అందులో భాగంగా తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు లాయర్స్ పోరం పర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ లైబ్రరీ కార్యదర్శి హైకోర్టు ప్రముఖ న్యాయవాది నర్రి స్వామి వివిధ బార్ అసోసియేషన్ లో జరిగిన నిరసన కార్యక్రమం లో పాల్గొని మాట్లాడుతూ మా యొక్క పోరాటం న్యాయవాదులకు రక్షణ చట్టాలు వచ్చేవరకు ఉంటుందని తెలియజేశారు వృత్తి నిర్వహణలో తన క్లైంట్స్ కు సలహాలు ఇస్తే కక్షతో హత్య చేస్తున్న వ్యక్తులు ఉన్న సమాజంలో సామాన్యుల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసు



కోవాలన్నారు రాష్ట్రంలో శాంతి భద్రతలు మెరుగ్గా ఉండాలంటే న్యాయవాదులకు రక్షణ చట్టాలు ఉండాలన్నారు. న్యాయమూర్తుల పైన న్యాయవాదుల పైన జరిగేటటువంటి దాడులపైన సమగ్రమైన దర్యాప్తు జరిపించి రక్షణ చట్టాలు ఏర్పడవలసినటువంటి ఆవశ్యకతను రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నాగుల శ్రీనివాస్ యాదవ్,పద్మారావు, గురువయ్య గౌడ్ దయ్యాల మాణిక్ రావు ,బర్కా రాకేష్, బీరయ్య ,జంగయ్య,అనేక మంది జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## రైతుల పట్ల శాపంగా మారిన ఏఈ రఘువీర్!

- నిమ్మకు నీరెత్తినట్లు మండల విద్యుత్ అధికారులు.
- ఏమరపాటు వాయించిన ప్రాణాలకే ప్రమాదం.
- నెల రోజులు గడుస్తున్న స్పందించని ఏఈ రఘువీర్.
- జూనియర్ లైన్ మెన్ దృష్టికి తీసుకెళ్లిన స్పందించని వైనం.
- నాకు సంబంధం లేదు చేయను ఎవరికి చెప్పకుంటావో చెప్పకోపో అని బెదిరింపులు.
- ఆందోళన చెందుతున్న రైతులు.

**పెద్దేముల్ మార్చి 25(ప్రజాక్షేత్రం):** పెద్దేముల్ మండల రైతుల పట్ల శాపంగా మారిన విద్యుత్ అధికారులు ఏఈ రఘువీర్, జూనియర్ లైన్మెన్ చందు.తమ పొలంలో విద్యుత్ తీగలు క్రిందికి జారి తలకు తాకే ఎత్తులో ఉన్నాయి. క్షణక్షణం భయం భయంగా బ్రతుకుతున్నామని పెద్దేముల్ గ్రామానికి చెందిన "ధర్మిది రాజు" అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తమ పొలంలో విద్యుత్ వైర్లు పూర్తిగా తలకు,చేతికి తాకే స్థితిలోకి జారాయని, విద్యుత్ తీగలను పైకి కట్టండి అని గత నెల రోజుల నుండి పెద్దేముల్ మండల విద్యుత్ అధికారి రఘువీర్, జూనియర్ లైన్మెన్ చందు దృష్టికి తీసుకువెళ్లిన బెదిరించి తమ పని కాదు అని చేతులు దులుపుకుంటున్నట్లు రైతు శ్రీకర్ వెల్లడించారు. దీంతో పొలం పనులు చేయాలంటే తీగలు మనుషులకు, వ్యవసాయ పనిముట్లకు తాకే ఎత్తులో ఉన్నాయి. పొరపాటున తగిలితే గనుక ప్రాణాలు పోయే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పుడు గనక చేయకపోతే వర్షాకాలంలో అన్ని పొలాల్లో పంటలు వేస్తారు. అప్పుడు చేయాలన్నా సాధ్యం కాదు. అధికారులు స్పందించి తక్షణమే విద్యుత్ వైర్లను ఒక స్తంభం సాయంతో పైకి కట్టాలని రైతు రాజు విద్యుత్ అధికారులను పలుమార్లు వేడుకున్నాడు. అయినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు మాకేం సంబంధం లేదు అనే రీతిలో సమాధానం ఇస్తున్నారు అని రైతు వాపోయాడు. ఈ మేరకు ఎప్పుడు, ఏ క్షణం ఏం జరుగుతుందోనని బిక్కు బిక్కుమంటూ ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని పొలం పనులు చేసుకుంటున్నాము. అనుకోకుండా చేయి పైకి ఎత్తితే విద్యుత్ వైర్లు చేతికి తాకి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ఇంత ప్రమాదం ఉంది అని విద్యుత్ అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత డివిజన్, జిల్లా అధికారులు స్పందించి మండల విద్యుత్ అధికారి పైన తక్షణమే చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా తమ పొలంలో ప్రమాదకరంగా కిందికి జారి ఉన్న విద్యుత్ వైర్లను పైకి కట్టాలని అధికారులను కోరుతున్నాము.



## బిజెపి పార్టీ జిల్లా కార్యదర్శిగా బిరుదు గట్టయ్య.

**ముత్తారం,మార్చి25 (ప్రజాక్షేత్రం):**

బిజెపి పార్టీ పెద్దపల్లి జిల్లా కార్యదర్శిగా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన బిరుదు గట్టయ్య నియామకమయ్యాడు.ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు కర్రే సంజీవరెడ్డి ఉత్తర్వులు జారీ చేశాడు.ఈ సందర్భంగా నూతనంగా కార్యదర్శిగా ఎన్నికైన బిరుదు గట్టయ్య మాట్లాడుతూ బీజేపీ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపాడు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు.బిజెపి పార్టీలో పని చేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు దక్కుతుందని అది ఒక బీజేపీ పార్టీకే సాధ్యమని అన్నారు.తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపాడు.



ప్రజాక్షేత్రం
తెలుగు దినపత్రిక

26.03.2025
బుధవారం | హైదరాబాద్

## చౌటుప్పల్ నుండి చిన్న కొండూరు వరకు డబుల్ రోడ్ నిర్మించాలి సిపిఎం పోరుయాత్ర డిమాండ్

- సిపిఎంజిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి
- సిపిఎం మండల కార్యదర్శి గంగాదేవి సైదులు

**చౌటుప్పల్,మార్చి 25(ప్రజాక్షేత్రం):**భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు చిన్న కొండూరు గ్రామ శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ పోరి యాత్ర లో భాగంగా ఈరోజు చిన్న కొండూరు గ్రామంలో పోరుయాత్ర నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌటుప్పల్ నుండి సంగెం డబల్ రోడ్డు ఏర్పాటు చేయాలని పనులను ప్రారంభించి అరకొర పనులతో రోడ్డు మరమ్మత్తులతో అక్కడ ఇక్కడ గుంతలు తీసి రోడ్డు వదిలేసిన పరిస్థితి ఉంది. రోడ్డుకి స్వాస్థ పరిష్కారం చూపెట్టాలని సిపిఎం పార్టీగా డిమాండ్ చేశారు.అదేవిధంగా స్మశాన వాటికకు సిసి రోడ్డు నిర్మించాలని గ్రామంలో ఉన్నటువంటి డ్రైనేజ్ సమస్యలు పరిష్కరించాలని వారు చెప్పుకొచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి మండల కార్య దర్శివర్గ సభ్యులు చింతల సుదర్శన్,మండల కమిటీ సభ్యులు చెరుకు లక్ష్మమ్మ,పార్టీ సీనియర్ నాయకులు ఎస్.కె ఇబ్రహీం,చెరుకు రమేష్,ఘర్ష లింగస్వామి,ఘర్ష శ్రీకాంత్,తిగుళ్ల మల్లయ్య, చింతపల్లి నర్సిరెడ్డి, ఎలకరాజ్ యాదగిరి,కోటయ్య,చింతల మధు తదితరులు పాల్గొన్నారు.





## అంగరంగ వైభవంగా శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

**చౌటుప్పల్,మార్చి 25(ప్రజాక్షేత్రం):**

చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులో గల శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో మంగళవారం శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా దేవస్థాన కమిటీ నిర్వహించారు.మంగళవారం స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం సుప్రభాతం,గణపతి పూజ,నవగ్రహ పూజ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10:30కు స్వామివారి ఎదుర్కోలు కార్యక్రమం దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించి, 11:30 నిమిషాలకు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛారణలతో అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా నిర్వహించారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు,చింతల దామోదర్ రెడ్డి, మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి,చౌటుప్పల్ మండల మరియు మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయ దేవేందర్, సుర్వి నర్సింహా గౌడ్, పాల్గొని స్వామివార్లకు కన్యాదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షులు నాగిళ్ల రామచంద్రం,ఉపాధ్యక్షులు చింతల ప్రభాకర్ రెడ్డి, ఊదరి శ్యాంసుందర్, ఉష్కాగుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఊదరి శంకర్, కోశాధికారి కానుగు శేఖర్ ముదిరాజ్ సహాయ కార్యదర్శి తొర్పునూరి మల్లేష్ గౌడ్ పాల్గొన్నారు.






## చలో ఇందిరా పార్క్

- గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి
- ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి

**నాంపల్లి,మార్చి 25(ప్రజాక్షేత్రం):**మంగళవారం రోజు నాంపల్లి మండలం వివిధ గ్రామాల్లో ఉన్న పంచాయతీ కార్మికులు న్యాయమైన సమస్యల పరిష్కారం కొరకు ఇందిరా పార్క్ ముందు మహాధర్నా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నాంపల్లి చంద్రమౌళి మాట్లాడుతూ వివిధ గ్రామాలలో పరిసరాలను శుభ్రం చేస్తూ మురికి కాలువలు తీస్తూ వెలుగులు పంచుతూ నీళ్ల సరఫరా చేస్తూ వివిధ పనుల్లో కష్టనష్టాలకు వచ్చి పనిచేస్తుంటే కనీసం వేతనం లేదు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జీపీ కార్మికులకు కనీస వేతనం రూ.18000 ఇవ్వాలని ఆయన అన్నారు. కార్మికులకు ప్రమాదకరంగా ఉన్న మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని కార్మికులకు న్యాయం చేయాలని ఆరోగ్యానికి గ్యారెంటీ ల కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి కార్మికులకు కూడా వర్తింప చేసే విధంగా ఉండాలని లేనియెడల సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు పనులు బందు చేసి సమ్మకు దిగాల్సిన పరిస్థితి వస్తుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతి ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు పల్లెటి హరికృష్ణ కార్యదర్శి ఎల్లయ్య ఉపాధ్యక్షుడు వెంకటయ్య కార్యదర్శి వర్గ సభ్యులు నాంపల్లి నరేష్ వెంకటయ్య గణేష్ రవి కాశయ్య జిమ్మిలాల్,తేజ రాములమ్మ సులోచన చంద్రమ్మ ఆయన సైదులు ఎల్లయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.



# హనుమాన్ మాల ధరించిన విద్యార్థిని వేధించిన సెయింట్ ఆన్స్ స్కూల్ యాజమాన్యం.





- పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని బీజేపీ నాయకుల డిమాండ్.
- పోలీసుల హామీతో ఆందోళన విరమణ.

**పెద్దపల్లి,మార్చి25(ప్రజాక్షేత్రం):**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అమర్ నాథ్ అనే విద్యార్థి మంగళవారం హనుమాన్ దీక్ష మాల ధరించి పాఠశాలకు హాజరయ్యాడు.అయితే,పాఠశాల యాజమాన్యం విద్యార్థిని ఎండలో నిలబెట్టి,పాఠశాలకు రావద్దని మానసికంగా,శారీరకంగా వేధించింది.ఈ సంఘటనపై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు,హనుమాన్ దీక్షాపరులు పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు.విద్యార్థిని వేధించిన యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని,పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు జోక్యం చేసుకుని చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.అనంతరం బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంజీవ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం మతపరమైన వివక్ష చూపడం సిగ్గుచేటని అన్నారు.విద్యాసంస్థలు కుల,మతాలకు అతీతంగా ఉండాలని,ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ ఆందోళనలో బీజేపీ నాయకులు పల్లె సదానందం,కడారి అశోక్ రావు,అమరగాని ప్రదీప్ కుమార్,శివంగారి సతీష్,పర్శ సమ్మయ్య, జంగా చక్రధర్ రెడ్డి,బెజ్జంకి దిలీప్ కుమార్,హనుమాన్ దీక్షాపరులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆశ వర్కర్లపై రాష్ట్ర ప్రభుత్వం వైఖరి నశించాలి:సిఐటియు

- అక్రమ అరెస్టులను ఖండిస్తూ నల్ల జెండాతో నిరసన
- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18 వేలు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి.
- పిఎఫ్,ఈఎస్ఐ,ఉద్యోగ భద్రత కల్పించాలి

**నాంపల్లి,మార్చి 25(ప్రజాక్షేత్రం)**అసెంబ్లీ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 18 వేలు ఫిక్స్డ వేతనం నిర్ణయించాలని అర్హులైన వారికి సెకండ్ ఏఎన్ఎం లుగా ప్రమోషన్లు కల్పించాలని ఆశ వర్కర్స్ యూనియన్ (సిఐటియు)జిల్లా ఉపాధ్యక్షురాలు రామావత్ కవిత డిమాండ్ చేశారు.మంగళవారం నాంపల్లి మండల కేంద్రంలో తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)ఆధ్వర్యంలో సోమవారం ఆశా వర్కర్ల చలో హైదరాబాద్ కార్యక్రమం సందర్భంగా శాంతియుతంగా ధర్నకు వెలుతున్న ఆశా వర్కర్లను ముందస్తు అరెస్టు చేయడం హైదరాబాద్ కు వెళ్లిన ఆశ వర్కర్లపై మహిళలలు అని చూడకుండా ధర్నాకు పోకుండా అడ్డుకొని వారిపై పోలీసుల దాడిని ఖండిస్తూ నల్ల జెండాతో నిరసన తెలుపడం జరిగింది ఆశ వర్కర్ల రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు మొండి వైఖరిని విడనాడాలని ఫిక్స్డ వేతనం నిర్ణయించాలని అన్నారు. సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా పోరాటాలు నిర్వహించిన స్పందించలేదని వెంటనే ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఇస్తున్న పారితోషకాలను రూ.18 వెలకు పెంచి ఫిక్స్డ వేతనం నిర్ణయించాలని,పారితోషం లేని అదనపు పనులు ఆశాలతో చేయించకూడదని, ఆశలకు పని భారం తగ్గించాలని పెండింగ్ లో ఉన్న కరోనా రిస్క్ అలవెన్స్ బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్స్ కు ప్రమాద బీమా,పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ప్రసూతి సెలవులు పైన సర్కులర్ ను వెంటనే జారీ చేయాలని హెల్త్ కార్డ్స్ ఇవ్వాలి ఆశాలకు జాబ్ చార్ట్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో ఆశ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకురాలు జిల్లా కమిటీ సభ్యులు కోరే లలిత సిర్ర మమత కవిత సునీత యాదమ్మ నీలిమ యశోద లక్ష్మమ్మ సైదమ్మ అరుణ పద్మ అండాలు విజయలక్ష్మి రజిత అంజమ్మ అనిత ధన లక్ష్మి కౌసల్య నాగమణి,రేణుక శంకరమ్మ రాధిక,తదితరులు పాల్గొన్నారు.



## ఇఫ్తార్ విందులతో స్నేహభావం పెంపొందుతుంది:జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.

**కలెక్టరేట్లో టి జి టి ఏ,టి జి ఆర్ ఎస్ ఏ అధికారుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు.**

**కొండాపూర్,మార్చి 25 (ప్రజాక్షేత్రం):**ఇఫ్తార్ విందుతో సోదర భావం పెంపొందిస్తుందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు.మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్లో టి జి టి ఏ తో పాటు టి జి ఆర్ ఎస్ ఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి కలెక్టర్ క్రాంతి వల్లూరు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు.అల్లా దయతో అందరు సుఖశాంతులతో,సహోదర భావం తో మెలగాలని ఆకాక్షించారు. ఇఫ్తార్ విందు తో ఉద్యోగుల్లో స్నేహభావం పొందుతుందన్నారు.ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం హర్షనీయం అన్నారు. అల్లా కృప అన్ని వర్గాల ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టి జి టి ఏ అధ్యక్షురాలు షేక్ హసీనా,జనరల్ సెక్రటరీ నజీమ్ ఖాన్,టి జి ఆర్ ఎస్ ఏ స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ హేమంత్,కలెక్టరేట్ ఏ. ఓ. పరమేష్ ,అందోల్ తహసీల్దార్ విష్ణుసాగర్,జిల్లా అధ్యక్షులు మర్రి ప్రదీప్,జనరల్ సెక్రటరీ సి.హెచ్. ప్రవీణ్,ఇతర అధికారులు,కలెక్టరేట్లోని వివిధ శాఖల కు చెందిన ముస్లిం మైనారిటీ ఉద్యోగులు, అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.




## నవ సత్యాగ్రహ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్

**మాక్లూర్,మార్చి 25 (ప్రజాక్షేత్రం):**మాక్లూర్ మండల కేంద్రంలో ఎస్.,ఆర్ ఫంక్షన్ హాల్ లో నవ సత్య గ్రహ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ వినయ్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధులను, రాజ్యాంగాన్ని,రాజ్యాంగ నిర్మాతలను అవమానిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ నినాదానికి పిలుపునిచ్చారని చెప్పారు. ఆదానీ,అంబానీ వంటి కార్పొరేట్ శక్తుల చేతుల్లో దేశాన్ని పెట్టాలని బీజేపీ ప్రయత్నం చేస్తోంది.వారి చేతుల్లో దేశం వెళ్లితే మన బతుకులు భద్రంగా ఉంటాయా మీరే ఆలోచించండి. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పై అమిత్ షా వ్యాఖ్యలు దేశ సమాజం క్షమించారనిదన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరు నడుం బిగించి.. గ్రామ గ్రామాన సంవిధాన్ ర్యాలీలు నిర్వహించలి అన్నారు. జై బాపు, జై భీమ్,జై సంవిధాన్ ఆశయాలకు తగ్గట్టుగానే మన రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ విధానాలను రూపొందిస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే విప్లవాత్మక కార్యక్రమాలు తీసుకోవడం జరిగిందన్నారు.బీసి కుల గణన,ఎస్సీ వర్గీకరణ బిల్లుల ఆమోదం సామాజిక విప్లవం,నిరుద్యోగులకు గత 15 నెలలో 58,868 ఉద్యోగాలను కలిపించింది. ఇవే కాక రానున్న రోజులలో 30,228 ఉద్యోగాల నియామకాలకు కసరత్తు చేస్తూ, ఇందులో గ్రూప్ 1,2,3 లలో ,అంగన్వాడీ లలో 14,236 ఉద్యోగాలను భర్తీకి మరియు గ్రామ పాలనాధికారులను 10,954 ఉద్యోగాలను భర్తీ చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.




## పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపిన నక్కలపల్లి గ్రామం మాజి సర్పంచ్ స్వప్న అంజయ్య గౌడ్

**మొయినాబాద్,మార్చి 25 (ప్రజాక్షేత్రం):**మండలములోని నక్కల పల్లి గ్రమంలో స్వప్న అంజయ్య గౌడ్ అధ్వర్యంలో పదవి విరమణ సన్మానం చేశారు. జిల్లా ఉత్తమ అవార్డు గ్రహీత ముచర్ల మల్లేశం ప్రధానోపాధ్యాయులు నక్కాలపల్లి గ్రామం.సభలో స్వప్న అంజయ్య గౌడ్ మాట్లాడుతు ముచర్ల మల్లేశం విద్యార్థులకు అందించిన సేవలు మరువలేనివి, ఎంతో మంది విద్యార్థులను తీర్చి దిద్దిన గొప్ప గురువు ముచర్ల మల్లేశం ప్రధానోపాధ్యాయులు అని ఆయన ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నేతలు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి, ఏ మధుసూధన్ రెడ్డి గ్రంధాలయ చైర్మన్ రంగాeరెడ్డి జిల్లా ఛైర్మెన్, యు పోచయ్య ఏస్టీఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సభ అద్యక్షులు కె మంగ స్జిటీ, చెన్నయ్య టీపిర్టీయు రాష్ట అధ్యక్షులు, కె , వెంకటయ్య ఏంఈ ఓ మొయినాబాద్ మండలం, గౌతమ్ కుమార్ ఏంఆర్వో మొయినాబాద్ మరియు తదితర నాయకులు పలువురు ముఖ్య అతిథులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## తెలంగాణ యూనివర్సిటీకి ఈశ్వారీభాయి నామవిస్తరణ చేయాలి: అంబేద్కర్ యువజన సంఘం

**నిజామాబాద్,మార్చి 25(ప్రజాక్షేత్రం):**తెలంగాణ యూనివర్సిటీకి ఈశ్వారీబాయి పేరు పెట్టి నామవిస్తరణ చేయాలని అంబేద్కర్ యువజన సంఘం (ఏవైఎస్) డిమాండ్ చేశారు.ఆర్మూర్ పట్టణ కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవనం నందు ఏ వై ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.మార్గదర్శకులుగా తెలంగాణ ఉద్యమ నేత, అంబేద్కరైట్ అడ్వకేట్ గంట సదానందం మాట్లాడుతూ ఈశ్వారీభాయి నిజమైన తెలంగాణవాది. తొలితరం తెలంగాణ పోరాట యోధురాలు.ఆమె అనేక ఉద్యమాల తోపాటు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరు చేసిన వీరనారి.ఆ రోజుల్లో తెలంగాణ ప్రజా సమితి (టిపిఎస్) ఉద్యమ సంఘంలో క్రియశీలక పాత్ర పోషించారు. ఆ టిపిఎస్ కు మదన్ మోహన్ కన్వీనర్ గా,మర్రి చెన్నారెడ్డితో సహా 3వ వరుసలో అత్యంత ప్రముఖ పాత్ర నిర్వహించారు. అదేవిధంగా విద్యా, వైద్యం, సాగునీరు,పరిశ్రమలు, విద్యాలయాలు మొదలైన శాఖల్లో తమ ప్రాంతానికి జరిగిన అన్యాయాలను ఆమె అసెంబ్లీలో గొంతెత్తారు.అట్టి మహిళా యోధురాలి పేరును యూనివర్సిటీకి నామకరణ చేయడం వందశాతం సబబే అన్నారు. రాష్ట్ర సీఎం త్వరలో నిర్ణయం తీసుకోవాలని, లేనిచో తెలంగాణవాదులు, ఎస్సీ ఎస్టీ బీసీ ప్రజలు ఉద్యమించక తప్పదని ఆయన హెచ్చరించారు. ఏవైఎస్ జిల్లా అధ్యక్షులు ఇత్వార్పేట్ లింగన్న మాట్లాడుతూ జనగం జిల్లాకు చాకలి ఐలమ్మ పేరు పెట్టాలి, ఆశా వర్కర్లపై నిర్బంధం సడలించాలి,వారి డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని రాష్ట్ర సర్కారుకు కోరారు. ఈ ప్రెస్ మీట్లో గోసంగి సంఘం నాయకులు లింగస్వామి, ఆదివాసీ నాయకపోడ్ సంఘం నేత నారి గంగాధర్, కొండ్రు నరేష్, పస్తం గంగాధర్, అడ్వకేట్ మామిడి రాజేశ్వర్, జర్నలిస్ట్ పింజ సుదర్శన్, ముంబైనేత మూలనివాసి మాలజీ పాల్గొన్నారు.




## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

**మాక్లూర్,మార్చి 25 (ప్రజాక్షేత్రం):**మాక్లుర్ మండల కేంద్రంలో హిందూ యువకులు.,ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఇవ్వడం జరిగింది.రంజాన్ మాసంలో ప్రతి సంవత్సరం ముస్లిం సోదరులకు తేనేటి విందును ఇస్తున్నామని యువకులు పేర్కొన్నారు. హిందూ ముస్లిం సోదరులు ఐక్యమత్యంతో కలిసిమెలిసి ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో షేక్ కమ్రుద్దీన్,రఫత్, తాజుద్దీన్ , భూషణ్,నరసయ్య, వెంకటరమణ,నరేష్,విష్ణు గౌడ్,అనిల్ గౌడ్, శ్రావణ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన కాంగ్రెస్ నాయకులు

**వలిగొండ,మార్చి 25(ప్రజాక్షేత్రం ):**యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ మండల పరిధిలోని పులిగిల్ల మధిర గ్రామం గోలిగూడెం కు చెందిన, పిన్నింటి మల్లారెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురి అయ్యి మంగళవారం రోజున మృతి చెందడంతో వారి కుటుంబానికి అదే గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకులు నక్కల మాధవరెడ్డి సౌజన్యంతో పదివేల రూపాయలు,బుగ్గ మనోజ్ కుమార్ రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కంచి రాములు,కొంతం వెంకట్ రెడ్డి, పైల నర్సిరెడ్డి,పల్సం భాస్కర్, వాకిటి సంజీవరెడ్డి,జెక్కిడి చంద్రారెడ్డి,వెంకట్రెడ్డి,పల్లెర్ల స్వామి,నాగరాజు,జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బీసీ గురుకులలో బ్యాగ్ లాగ్ సీట్లకు ధరఖాస్తు

**చేవెళ్ల, మార్చి 25(ప్రజాక్షేత్రం ):**మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నా బీసీ గురుకుల పాఠశాలలో 202526 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న 6,7,8,9వ తరగతుల సీట్లను చేయడానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఎంజేపీ గురుకుల పాఠశాల, ఎఫ్.ఏ.సీ ప్రిన్సిపాల్ జంగం నరేష్, ఒక ప్రకటనలో తెలిపారు. WWW.mjpbcwres. telangana.gov.in వెబ్ సైట్ లో దరఖాస్తు, చేసుకోవాలని ప్రిన్సిపాల్ జంగం నరేష్ సూచించారు. 6,7,8,9వ తరగతుల, ఇంగ్లీష్ మీడియంలో మొత్తం 6,832 బ్యాగ్ లాక్ ఉన్నాయని అర్హులైన విద్యార్థులు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష 2004 2025 ఆదివారం ఉదయం 10 గంటల నుంచి



మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ప్రవేశ పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపిక జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఏటిపి లింగ స్వామి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పిట్టలకేరిలో 18 వ వార్డు మాజీ కౌన్సిలర్ ఇలియాజ్ షరీఫ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు.

**సంగారెడ్డి మార్చి 25(ప్రజాక్షేత్రం):**

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణము పిట్టలకేరి 18 వ వార్డు మాజీ కౌన్సిలర్ ఇలియాజ్ షరీఫ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు న్యాయవాది, మన్ బీన్ వ్యవస్థాపకులు ఎం ఏ ముఖీమ్ రావడం జరిగింది. ఈ సందర్భంగా ఎంఏ ముఖీం, ఇలియాజ్ షరీఫ్ వారు మాట్లాడుతూ రంజాన్ పండుగ ముస్లింలకు అతిముఖ్యమైందని, రంజాన్ పవిత్ర మాసంలో ముస్లిం సోదరులు సోదరీమణులు ఉపవాస దీక్షలు చేపట్టి వారి యొక్క అల్లాకు భక్తిశ్రద్ధలతో ప్రార్థించడం జరుగుతుందన్నారు.



## టీబీ డే పోస్టర్ ఆవిష్కరణ

**శేరిలింగంపల్లి మార్చి 25(ప్రజాక్షేత్రం):** వరల్డ్ టీబీ డే పురస్కరించుకొని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరకపూడి గాంధీ టీబీ ఐఇసి సంబంధించిన మెటీరియల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. వరల్డ్ టీబీ డే సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో వైద్యాధికారి డాక్టర్ ఉమా దీపిక పాల్గొని మాట్లాడారు. ఎవరికైతే రెండు వారాలకు మించి దగ్గు కానీ జ్వరం కానీ, బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీవీకి సంబంధించిన పరీక్షలు, మందులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. వరల్డ్ టీబీ డే సందర్భంగా జిల్లాలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన టీబీ హెచ్ వి బి సంతోష్, ఆశాలకు ధర్మజా, స్వాతిని జిల్లా ప్రధాన వైద్యాధికారి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ ఉమా దీపిక, ట్రీట్మెంట్ సూపర్వైజర్ బీములు, టీబీ హెచ్ విబి సంతోష్, స్టాటిస్టిస్కల్ అసిస్టెంట్ సతీష్, సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటం

**ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు**

**అనకాపల్లి,మార్చి 25(ప్రజాక్షేత్రం):**జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాజీలేని పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులు అన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ అనకాపల్లి జిల్లా సర్వసభ్య సమావేశం మంగళవారం పట్టణంలోని తాటికొండ నూకయ్య శెట్టి మెమోరియల్ హాల్లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆంజనేయులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్కింగ్ జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత అత్యంత కీలకమైనదన్నారు. ప్రభుత్వాలు జర్నలిస్టుల సంక్షేమం పట్ల ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.జర్నలిస్టులకు వైద్యం,బీమా సదుపాయాల విషయంలో ప్రభుత్వాలు అలసత్వం చూపడం తగదన్నారు. అలాగే జర్నలిస్టులకు చిరకాల కలగా ఉన్న సొంతింటిని ఈ ప్రభుత్వమైనా సాకారం చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.ఫెడరేషన్ అవిరాళ కృషి వల్లే గత ప్రభుత్వం జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం జీవో ఇచ్చిందన్నారు.జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుందని పునరుద్ఘాటించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు/ఇళ్ల కోసం ప్రత్యేక కార్యాచరణతో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు కొండబాబు మాట్లాడుతూ,జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా ఫెడరేషన్ పనిచేస్తోందన్నారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీను బాబు మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను త్వరలోనే కూటమి పెద్దల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇప్పటికే పలుమార్లు పలువురు ప్రభుత్వ పెద్దలకు విజ్ఞాపనల




రూపంలో అందజేశామన్నారు.త్వరలోనే ఫెడరేషన్ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో ప్రభుత్వ పెద్దలను కలుస్తామని చెప్పారు.ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ మాట్లాడుతూ జర్నలిస్టులకు అండగా నిలిచే సంఘం ఏపీడబ్ల్యూజేఎఫ్ మాత్రమేనని చెప్పారు. విశాఖ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ, మన్యం పార్వతీపురం జిల్లా కన్వీనర్ ధవళేశ్వరపు రవికుమార్ మాట్లాడుతూ, వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలపై నిబద్ధతతో పోరాడుతున్న సంఘం ఫెడరేషన్ మాత్రమేనని అన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమం కోసం రెండు దశాబ్దాలుగా కృషి చేస్తోందన్నారు. ఇటీవల కాలంలో జర్నలిస్టులపై జరిగిన దాడుల ఘటనల్లో బాధితులకు అండగా ఫెడరేషన్ ఉద్యమించిన తీరే ఇందుకు తార్కాణ మన్నారు. అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఈశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బి.వెంకటేష్, విశాఖ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు, డిప్యూటీ సెక్రటరీ ఎ.సాంబశివరావు, ఉపాధ్యక్షులు ఆనంద్, సంయుక్త కార్యదర్శి జి.రాంబాబు, బ్రాడ్ కాస్టింగ్ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈశ్వరరావు,మదన్, స్మాల్ పేపర్స్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్, అనకాపల్లి జిల్లాకు చెందిన ఫెడరేషన్ సభ్యులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం అనకాపల్లి జిల్లా ఫెడరేషన్, బ్రాడ్ కాస్టింగ్ అసోసియేషన్ కార్యవర్గాల ఎన్నిక జరిగింది.

## బెట్టింగులపై ప్రత్యేక దృష్టి:పోలీస్ కమిషనర్

**ఐపీఎల్ బెట్టింగులపై ప్రత్యేక దృష్టి పెట్టి పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

**ఖమ్మం,మార్చి 25 (ప్రజాక్షేత్రం):** పోలీస్ కాన్ఫరెన్స్ హాలో పోలీస్ అధికారులతో జరిగిన నేర సమీక్ష సమావేశంలో పోలీస్ స్టేషన్ల వారిగా నమోదైన గ్రేవ్,నాన్ గ్రేవ్,పోక్సో కేసులలో చేసిన దర్యాప్తు, విచారణ స్థితిగతులు, పెండింగ్ కేసుల పురోగతి పై సమీక్ష జరిపారు.సత్వర పరిష్కారం,సక్రమ విచారణ కోసం సంబంధిత దర్యాప్తు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... బెట్టింగ్,లోన్ యాప్ కార్యకలాపాలపై పూర్తిగా నిఘాను పెంచాలని,బెట్టింగ్ నిర్వహిస్తున్నారని సమాచారం వస్తే చాలు వెంటనే దాడులు చేయాలని ఆదేశించారు. సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్షల నుండి తప్పించుకొలేరనే భావన నేరస్తుల్లో కలిగించాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. కీలకమైన కేసుల్లో..కేసు నమోదు నుంచి అభియోగ పత్రాలు దాఖలు వరకు ప్రతి అంశలో కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విధిగా విజబుల్ పోలీసింగ్ అమలు చేయాలని తద్వారా నేరాలు నియంత్రణలో వుంటాయని అన్నారు. ఎట్టి పరిస్థితులలో పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ రవాణా జరుగరాదని, అధికారులు సమన్వయంతో పటిష్టమైన నిఘా పెడుతూ పూర్తిగా కట్టడి చేయాలని పోలీసు అధికారులకు ఆదేశించారు.అదేవిధంగా



తీవ్రమైన నేరాలు,పోక్సో, ఎస్సీ ఎస్టీ కేసుల దర్యాప్తుల్లో మరింత నాణ్యత ప్రమాణాలను పాటించాలని, పెండింగ్ ఉన్న ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్స్, పోస్టుమార్టం రిపోర్ట్స్, నేరస్తుల అరెస్టు చేయని కేసులలో నేరస్తులను అరెస్టు చేసి త్వరగా ఇన్వెస్టిగేషన్ పూర్తిచేసి చార్జిషీట్ దఖాలు చేయాలని సూచించారు.అలవాటుగా నేరాలు చేసే నేరస్తులపై హిస్టరీ షీట్‌లను తెరచి సరిహద్దు జిల్లాల పోలీస్‌స్టేషన్ల అధికారులతో నిరంతరం సమాచారాన్ని పంచుకుంటూ వారి కదలికలపై నిఘా ఉంచి వారి ద్వారా భవిష్యత్‌లో ఎటువంటి నేరాలు జరగకుండా నివారించాలి. నిర్మానుష్య ప్రాంతాలను అడ్డాలుగా చేసుకొని అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్,ర్యాష్ డ్రైవింగ్ పై తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.సమావేశంలో అడిషనల్ డీసీపీ ఆడ్మిన్ నరేష్ కుమార్,ట్రైనీ ఐపిఎస్ అధికారి సాయి రిత్విక్, ఏసీపీలు రమణ మూర్తి, తిరుపతి రెడ్డి,రహెమాన్, రఘు,వేంకటేశ్,సాంబరాజు, రవి,సర్వర్,శ్రీనివాసులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘము మహిళ ప్రధాన కార్యదర్శి చింతగింది సుజాత ఇంట్లో మల్లన్న కళ్యాణోత్సవము

సికింద్రాబాద్ మార్చి 25(ప్రజాక్షేత్రం):సికింద్రాబాద్ నియోజకవర్గం లోని బౌద్ధ నగర్ డివిజన్ లోని అంబర్నగర్ లో గ్రేటర్ వారాసిగుడ పద్మశాలి సంఘం మహిళా ప్రధాన కార్యదర్శి చింతకింది సుజాత ఇంట్లో మల్లన్న కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ముఖ్య అతిథులుగా బౌద్ధ నగర్ స్థాడింగ్ కమిటీ మెంబర్ కంది శైలజా మరియు సికింద్రాబాద్ పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ నరేంద్ర పద్మశాలి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ హిందూ సంప్రదాయంలో అనాదిగా కొమురవెల్లి మల్లన్నను కొలవడంతో పాటు రేణుకా ఎల్లమ్మ తల్లిని, మల్లన్న కు యిచ్చి వివాహం చేయడం అదేవిధంగా అమ్మవారికి నైవేద్యము బోనాలు సమర్పించారు. చింత కింది సుజాత దంపతులు ధన్యులు. పెండం సంతోష్, కిషోర్ గౌడ్, నరేష్, బల్ల గీత, బొమ్మ



శశికళ, సాయి, మహిళలు పెద్దలు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పర్వేద పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**శంకర్ పల్లి మార్చి 25(ప్రజాక్షేత్రం):** 15సంవత్సరాల తర్వాత జీవితంలో స్థిరపడి ఒకే వేదికపై అందరూ చిన్ననాటి తరగతిగది చిలిపి చేష్టలను నెమరు వేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం పర్వేద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20092010 సంవత్సరంలో పదవ తరగతి చదివి తదనంతరం వారి వారి వృత్తి, ఉద్యోగాలలో స్థిరపడిపోయారు. అయితే వారంతా ప్రస్తుతం ఒకే వేదికపై జడ్.పి.హెచ్.ఎస్ పర్వేద స్కూల్ లో ఏర్పాటు చేసుకున్న ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకొని తమ చిన్ననాటి అనుభవాలను వేదికపై పంచుకున్నారు. పాఠశాలలోని తరగతి గదిలో జరిగిన సంఘటనలను పూర్వ ఉపాధ్యాయులు ,పూర్వ విద్యార్థుల సమక్షంలో వారి వారి అభిప్రాయాలను పంచుకొని ఆనందంగా గడిపారు. 15 సంవత్సరాల అనంతరం ఇలా అందరూ ఒకే వేదికపై కలుసుకోవడం సంతోషంగా ఉందని వారి వారి అభిప్రాయాలలో వెలి బుచ్చారు. అప్పట్లో ఉపాధ్యాయులుగా పనిచేసిన కొందరు మాట్లాడుతూ 15 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంత కిషన్ రావు, అనిల్ కుమార్, రవీందర్, నరసింహ, గోపాల్, సుధాకర్, వెంకటేశం, గోపాల్, శ్రీరాములు, వెంకటేశం, లక్ష్మణ్, విజయ భాస్కర్, రామ్ చందర్, వెంకటేశం, సంధ్యారాణి, శ్రీదేవి, సీతా మహాలక్ష్మి, అనుపమ, ఉమామహేశ్వర్ పూర్వ విద్యార్థుల తదితరులు పాల్గొన్నారు.




## గుత్ప మాలపల్లి లో సిసి రోడ్లను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు

**నిజామాబాద్,మార్చి 25(ప్రజాక్షేత్రం ):**ఆలూర్ మండలం గుత్ప గ్రామం మాలపల్లి మహారాజుల కాలనీలో రూ.45 లక్షలతో సిసి రోడ్లు ప్రారంభం.25 లక్షలు ఎన్.ఆర్.జి.ఎస్, ఎస్ డి ఎఫ్ 20 లక్షలు తో కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకులు జితేందర్ మాట్లాడుతూ అడగగానే మంత్రి తో మాట్లాడి నిధులు తెప్పించిన ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.అలాగే బిజెపి బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని చూసి ఓర్వలేక బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.బిజెపి మతాలపై చిచ్చు పెడుతూ అధికారం చేలాఇస్తున్నారు. ఇప్పటివరకు ఏ గవర్నమెంట్ ఇంత తక్కువ కాలంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేదు. అలాంటిది ఈ కాంగ్రెస్ హయాంలోనే 56 వేల ఉద్యోగాలు ఇచ్చింది కాంగ్రెస్ ఒకటి అని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రూప, జితేందర్,కొండ్ర నరేష్,మేరా గంగాధర్,ప్రసాద్,కొండ్రా గంగాధర్,భూమేశ్వర్,పెద్దబైరి సతీష్,సాయిలు,పోషన్న,జగదీష్,శ్రీధర్ వంశీ,కళ్యాణ్,సురేష్, బాండ్లపల్లి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



## కల్లేడి గ్రామంలో బయటపడ్డ సీతారాముల విగ్రహాలు

**మాక్లూర్,మార్చి 25(ప్రజాక్షేత్రం ):**ఆలూర్ మండల పరిధిలోని కల్లేడి గ్రామం లో పురాతన సీతారాముల విగ్రహాలు మంగళవారం బయటపడ్డాయి. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ సమీపంలో ఉన్న చెట్ల పొదలు శుభ్రం చేస్తుండగా వారికి ఓ వింత ఆకారం కనిపించింది. ఏంటా.. అని చూస్తే పురాతన సీతా రాముల



విగ్రహాలు కనిపించాయి.విషయాన్ని గ్రామ ప్రజలకు తెలియజేయగా వారు కూడా వచ్చి విగ్రహాలను క్షుణ్ణంగా పరిశీలించారు.వెంటనే విగ్రహాలను వెలికితీసి అక్కడే నీటితో అభిషేకం చేశారు. విగ్రహాలకు పసుపు,కుంకుమ, పూలు పెట్టి పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. స్థానిక ప్రజలు మాత్రం విగ్రహాలు లభ్యమైన చోటే రామాలయాన్ని నిర్మించాలని స్థానికులు చర్చించుకుంటున్నారు.

## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు.

**చేవెళ్ళ మండల కేంద్రంలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న భీమ్ భరత్**

**చేవెళ్ల మార్చి 25(ప్రజాక్షేత్రం ):**పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని చేవెళ్ళ అసెంబ్లీ ఇంచార్జ్ భీమ్ భరత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కేజీఆర్ గార్డెన్ లో చేవెళ్ళ పిఎసిఎస్ చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డి మరియు చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజ అగిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రంజాన్ మాసం ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మరియు రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లింల కోసం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో సాముహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు. సర్వమత సారం ఒక్కటేనని, మనుషులంతా సోదర భావంతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చేవెళ్ళ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# వివోఏ ల ముందస్తు అరెస్ట్

**ఆత్మకూర్ మార్చి 25(ప్రజాక్షేత్రం):** గ్రామ సంఘం సహాయకుల (వివోఏ) సమస్యల సాధనకై రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఛలో హైదరాబాద్ తరలివెళ్లకుండా వెళ్లకుండా వివోఏ లను ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ పరిధి లో ముందస్తు అరెస్ట్ చేయడం చేయడం జరిగింది. అరెస్ట్ అయిన వారిలో వివోఏ ల సంఘం నాయకులు వేముల నర్సింహ్మా, మొలుగురి శిరీష, తవిటి స్వప్న, పాశం శ్యామల లు ఉన్నారు.



# సౌరశక్తితో నడిచే నీటి పంపు? ఓ రైతు కనుగొన్న వినూత్న పరికరం వైరల్

**ఇంటర్నెట్ డెస్క్ మార్చి 25(ప్రజాక్షేత్రం):** డిజిటల్ టెక్నాలజీ వచ్చిన తర్వాత వ్యవసాయ రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రైతులకు శ్రమను తగ్గించి లాభం చేకూర్చే పరికరాలు నేడు మార్కెట్లో అందుబాటులో వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కరెంట్ లేకుండా కేవలం సౌరశక్తితో నడిచే నీటి పంపు కోసం ఓ రైతు వినూత్న పరికరాన్ని కనుగొన్నట్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. వీడియోలో చూపించిన ప్రకారం.. ఓ వ్యక్తి పంపు సెట్టు వద్ద ఓ స్టాండ్‌పై బాండీ వంటి వస్తువును ఎండ వేడిమి గ్రహించేలా దాన్ని అమరుస్తాడు. ఆ బాండీ వంటి వస్తువుకు అల్యూమినియం రేకు కాగితం పై పూతగా ఉన్నట్టు కనబడుతుంది. ఈ బాండీ నుంచి వచ్చే ఎనర్జీని గ్రహించేందుకు ఓ పరికరాన్ని వినియోగిస్తాడు. దానికి స్విచ్‌బోర్డు కనెక్ట్ అయి ఉంటుంది. మోటర్ పంపు వైర్ స్విచ్ బోర్డు ప్లగ్‌లో పెట్టగానే బోరు నుంచి నీరు గల గల పారుతోంది. కరెంట్‌తో నడిచే నీటి పంపు మాదిరి నీరు వస్తోంది. ఆ బాండి వంటి వస్తువును స్టాండ్‌పై తొలగించిన ప్పుడు బోరు కూడా ఆగిపోతున్నట్లు వ్యక్తి వీడియో లో చూపించే ప్రయత్నం చేస్తాడు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ క్రమంలోనే నెటిజన్లు రకరకాలుగా వీడియోపై రియాక్ట్ అవుతున్నారు. సౌరశక్తితో నడిచే నీటి పంపు వల్ల రైతులకు చాలా లాభాలు ఉంటాయని, కరెంట్ లేని మారుమూల ప్రాంతాల్లో ఇలాంటి పరికరం ఎంతో ఉపయోగపడుతుందని నెటిజన్లు భావిస్తున్నారు. కరెంట్ బిల్లు ఖర్చు సైతం ఉండదని కామెంట్స్ పెడుతున్నారు. మరికొందరు ఇది ఫేక్ వీడియోగా భావిస్తున్నారు. ఒక వేలా పరికరం నిజమే అయితే మాత్రం రైతులకు ఎంతో లాభమని నెటిజన్లు వారి అభిప్రాయాలను పంచుకున్నారు.



# న్యాయవాది ఇజ్రాయిల్ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నాం.

- న్యాయవాద రక్షణ చట్టాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి
- మడ్డి అశోక్ కుమార్ బార్ అసోసియేషన్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు

**వికారాబాద్ మార్చి 25(ప్రజాక్షేత్రం):** చంపాపేటలో జరిగిన న్యాయవాది ఇజ్రాయిల్ హత్యను తీవ్రంగా ఖండిస్తు, న్యాయవాద రక్షణ చట్టాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ మడ్డి అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. వికారాబాద్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ న్యాయవాది కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. హత్యలకు పాల్పడుతున్న హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో అనేక మంది న్యాయవాదులు హత్యలకు గురవుతుండడం శోచనీయమన్నారు. ఈ విషయంలో ప్రభుత్వాలు సరైన చొరవ చూపకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. న్యాయవాదులందరూ ఐక్యంగా నిలబడి న్యాయవాదుల రక్షణ చట్టం కొరకు పోరాడాలని పిలుపునిచ్చారు. సమస్యలను న్యాయపరంగా ఎదుర్కోవాలని హత్యలు చేయడం పరిష్కారం కాదని పేర్కొన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం కోసం జరిగే పోరాటంలో. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఐ లు సంపూర్ణ మద్దతును ప్రకటిస్తుందని తెలిపారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా బార్ అసోసియేషన్ తమ విధులను బహిష్కరించి నిరసనలు తెలియజేయడం జరిగిందని వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



# మృత్యు కేంద్రాలుగా ప్రైవేట్ ఆస్పత్రులు

- అందినకాడికి దండుకుంటున్న వైనం
- ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు
- నిద్రావస్థలో వైద్య ఆరోగ్యశాఖ

**శంకర్ పల్లి మార్చి 25(ప్రజాక్షేత్రం):** మంచిర్యాల జిల్లాలో వైద్యం పక్కా వ్యాపారంగా మారిపోయింది. ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు రోగులను ఆర్థికంగా పీల్చి పిప్పి చేస్తున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స కోసం వెళ్లే రోగులు మృత్యువాత పడుతున్న ఘటనలు జిల్లాలో పెరుగుతున్నాయి. అత్యవసర చికిత్స కోసం ఆసుపత్రులకు వచ్చే రోగులు ప్రాణం మీద ఆశలు వదులుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు రోగులను ఆర్థికంగా దోచుకుంటూ, అరకొర వైద్యం అందించి ఇతర ప్రాంతాలకు రిఫర్ చేస్తుండటంతో మార్గం మధ్యలోనే మరణించే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఆసుపత్రిలో చేరిన రోగి నుంచి ఎంత వీలైతే అంత దోచేయడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. చిన్నపాటి సమస్యతో వెళ్లినా అనేక పరీక్షలు చేసి రోగుల నుంచి అందినకాడికి దండుకుంటున్నారు. పొరపాటున ఆరోగ్యం ఇబ్బందిగా ఉండి ఆసుపత్రిలో చేరాల్సి వస్తే. పరిస్థితి మరింత దారుణం. రూ. లక్షలు వసూలు చేస్తున్నారు. ఇటీవల ఈ తరహా ఉదంతాలు జిల్లాలో భారీగా వెలుగు చూస్తున్నాయి. రోజుల తరబడి వైద్యం చేయడం, రూ. లక్షలు వసూలు చేయడం, చివరి నిమిషంలో అత్యవసర వైద్యం పేరుతో మరో ఆసుపత్రికి తరలించి చేతులు దులుపు కోవడం ప్రైవేటు ఆసుపత్రులకు పరిపాటిగా మారింది. ఈ ఆసుపత్రులతో జరుగుతున్న వ్యవహారాలను నిత్యం పర్యవేక్షించాల్సిన వైద్యారోగ్య శాఖ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండడంతో ఆసుపత్రి యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నాయి

**క్రిటికల్ పరిస్థితుల్లో కాలయాపన**

క్రిటికల్ పరిస్థితుల్లో 'గోల్డెన్ అవర్స్' అత్యంత కీలకం. ఆ సమయాల్లో సరైన చికిత్స అందిస్తే రోగులు ప్రాణాలతో బయటపడే అవకాశముంది. కానీ మంచిర్యాలలో చికిత్స పేరిట ప్రైవేట్ ఆసుపత్రులు కాలయాపన చేస్తున్నాయని, అందుకే రోగులు ప్రాణాలు కోల్పోతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు తరచుగా జరుగుతున్నా పట్టించుకునేవారు లేకపోవడం గమనార్హం. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఆసుపత్రులపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల మందమర్రికి చెందిన ఓ వ్యక్తి ఛాతిలో నొప్పితో మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరాడు... చికిత్స అందించిన వైద్యులు... రెండు రోజుల తర్వాత 2 లక్షల వరకు ఫీజు తీసుకోని ఎమర్జెన్సీ పేరుతో హైదరాబాద్ కు తరలించారు. దింతో హైదరాబాద్ లో ఆ వ్యక్తి చనిపోయాడు... ఈ ఘటన పై సంబంధిత ఆసుపత్రి పై మృతుని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో బయటకురానివి చాలా ఉన్నాయి.




### అడ్డగోలు బిల్లులతో ప్రజలు విలవిల

మంచిర్యాలలో చికిత్స పొందాలంటే ప్రజలు ఆస్తులు అమ్ముకునే స్థితికి చేరుకున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అడ్డగోలుగా డబ్బులు వసూలు చేస్తుండటంతో సామాన్య ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చేవారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని, చిన్నపాటి రోగానికి కూడా పలు రకాల వైద్య పరీక్షలు చేయించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ఏం చేయలేక అప్పులు చేసి ఆసుపత్రి ఖర్చులు భరించాల్సిన పరిస్థితి నెలకొంది. అవసరం లేకున్నా భారీగా ఆరోగ్య పరీక్షలు చేసి ప్రజల నుంచి డబ్బులు దండుకుంటున్న ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో కొనసాగుతున్న దోపిడీపై ప్రభుత్వ ఆరోగ్యశాఖ అప్రమత్తమవ్వాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రతి ఆసుపత్రిలో ఖర్చులను పారదర్శకంగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని, అత్యవసర చికిత్సను సకాలంలో అందించేలా పర్యవేక్షణను పెంచాలని ప్రజలు కోరుతున్నారు. కొన్ని ఆసుపత్రుల్లో మానవీయ కోణంలో చికిత్స అందిస్తున్నారు. తక్కువ ఫీజులతోపాటు అవసరమైన వైద్య పరీక్షలు మాత్రమే నిర్వహిస్తు ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఇలాంటి ఆసుపత్రులు జిల్లాలో అతి తక్కువగా ఉన్నాయి.... మంచిర్యాల జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రులు అందుబాటులో ఉన్నప్పటికీ అధిక శాతం మంది రోగులు ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం పొందేందుకు మొగ్గు చూపుతుంటారు. ఇదే ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులకు కలిసొస్తున్నది. కొంతమంది వైద్య నిపుణులు.. ప్రైవేట్ వ్యక్తులు ధనార్జనే ధ్యేయంగా ప్రైవేటు ఆస్పత్రులను నడుపుతున్నారు.

**అవసరం లేకున్న వైద్య పరీక్షలు**

జ్వర బాధితులు వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే రక్త పరీక్షల పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారు. ఆస్పత్రులకు అనుబంధంగా ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకోవాలంటే ప్రత్యకంగా అనుమతులు పొందాలి. కానీ చాలా ఆస్పత్రులు ఎటువంటి అనుమతులు లేకుండానే ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారు. సాధారణ జ్వరం అయినప్పటికీ రక్త పరీక్షలతోపాటు అవసరం లేకపోయినా ఆస్పత్రులకు అనుబంధంగా ఉండే లేబొరేటరీల్లో స్కానింగ్, ఎక్స్‌రే, ఈసీజీ వంటివి చేయించుకోవాలని ప్రిస్క్రిప్షన్ రాస్తున్నారు. ఈ పరీక్షలకు రూ.వందలు, రూ.వేలల్లో ఫీజులు దండుకుంటున్నారు. ఇక ప్రైవేటు ల్యాబ్‌ల నిర్వాహకులు ప్రభుత్వ ఆస్పత్రులకు సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండానే కలెక్షన్ సెంటర్ల పేరుతో ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

**వాట్సాప్ లో వైద్యం...**

మంచిర్యాల జిల్లాలో వివిధ రోగాలకు సంబంధించిన పూర్తి స్థాయి డాక్టర్స్ అందుబాటులో లేరు.. కొన్ని విభాగాలకు చెందిన డాక్టర్లు అందుబాటులో ఉన్నారు.. కాని అన్ని రకాలైన వైద్య సేవలు అందిస్తామని బోర్డులు పెట్టి ప్రజలను మోసం చేస్తున్నారు... ఎదైన రోగం వస్తే సంబంధిత విభాగానికి చెందిన డాక్టర్ లేకుండానే జూనియర్ డాక్టర్స్, నర్సులు వైద్యం చేస్తున్నట్లు సమాచారం. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రిపోర్టులను ఆస్పత్రిలోని సిబ్బంది ద్వారా ఫోన్ నుంచి సంబంధిత డాక్టర్ వాట్సాప్‌కు పంపిస్తారు. అనంతర డాక్టర్ వాట్సప్‌లోనే పలు ఇంజక్షన్స్ తో పాటు రోగికి చేయాల్సిన ట్రీట్మెంట్ సిబ్బందికి వివరిస్తారు. దానిని అనుసరించి సిబ్బంది వైద్యం అందిస్తారు. రోగి పరిస్థితి సీరియస్ గా మారితే వెంటనే హడావుడి చేసి వేరే ఆసుపత్రికి తీసుకోవాలని కుటుంబ సభ్యులకు చెబుతారు దాంతో రోగి హైదరాబాద్, కరీంనగర్ లో ఉన్న ఆసుపత్రులకు పోయే క్రమంలో ప్రాణాలు కోల్పోతున్నాడు. ట్రీట్మెంట్ సమయంలో పేషెంట్ మరణించినా ఫీజు విషయంలో ఆస్పత్రులు వెనక్కి తగ్గడం లేదు. ముందుగా చెప్పిన మేరకు ఫీజు చెల్లిస్తేనే డెడ్ బాడీ ఇస్తామని తేల్చి చెబుతున్నాయి. ఫీజు చెల్లించడానికి ఒకరోజు కంటే ఎక్కువ టైమ్ తీసుకుంటే అదనపు డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం... దింతో చేసేది ఏమీలేక అప్పులు చేసి మరి ఫీజులు చెల్లిస్తున్నారు. కనికరం మరిచిన ఆసుపత్రులు డబ్బులే లక్ష్యంగా పనిచేస్తున్న తరుణంలో పేదలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు.



**ప్రైవేట్ ఆసుపత్రులను పట్టించుకోని అధికారులు**

ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు నిబంధనలను ఉల్లంఘిస్తూ తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా, సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చూసీ చడనట్లుగా వ్యవహరిస్తున్నారు . ఆసుపత్రుల్లో గల అక్రమాలపై ఫిర్యాదులు వచ్చినప్పటికీ, అధికారులు ముమ్మాటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని ఆసుపత్రుల్లో అధిక ఫీజులు వసూలు చేయడం, నిబంధనలకు విరుద్ధంగా వైద్యం అందించడం, సరైన అనుమతులు లేకుండానే చికిత్సలు నిర్వహించడం వంటి ఘటనలు వెలుగులోకి వచ్చినా, సంబంధిత అధికారులు కేవలం రెండు మూడు రోజులు హంగామా చేసి మళ్లీ మౌనం పాటిస్తున్నారు.

-రేగుంట రాకేశ్,
మంచిర్యాల జిల్లా వాసి.

# యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేయాలి

**కరీంనగర్, మార్చి 25(ప్రజాక్షేత్రం):** యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కొనుగోలు కమిటీ సభ్యులను కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కొనుగోళ్ల కమిటీ సభ్యులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ధాన్యం పూర్తిగా పరిపక్వతకు వచ్చిన తర్వాతనే హార్వెస్ట్ చేసేలా రైతులకు, హార్వెస్టింగ్ మిషన్ ఆపరేటర్లకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ధాన్యం కోతలకు సంబంధించి రెవెన్యూ గ్రామాల వారీగా నిర్దిష్ట ప్రణాళిక ఏర్పాటు చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకపు యంత్రాలు, తేమను కొలిచే యంత్రాలు, గన్ని సంచులు, తార్పాలీన్ కవర్లు వంటివి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇప్పుడు ఉన్న ప్యాడి క్లీనర్ లతో పాటు మరో 15 ప్యాడి క్లీనర్ లను కొనుగోలు చేయాలని సూచించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ధాన్యం కొనుగోలు తర్వాత వెంటనే వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలని తెలిపారు. రైతుకు సకాలంలో సొమ్ము అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకాల ధాన్యాలు వేరువేరు ప్రదేశాల్లో ఉండేలా చూడాలని సూచించారు. ఎండాకాలం దృశ్య రైతులకు నీడ, తాగునీటి సౌకర్యం ఉండేలా చూడాలని తెలిపారు. సిబ్బంది కొనుగోలు రిజిస్టర్ ను అందుబాటులో ఉంచుకోవాలని, పకడ్బందీగా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. తేమ యంత్రాన్ని నీడలోనే ఉండేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# క్యాబినెట్ విస్తరణపై రాజగోపాల్ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్ మార్చి 25(ప్రజాక్షేత్రం):** మంత్రి పదవిపై మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మీడియాతో చిట్ చాట్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు మంత్రి పదవి వస్తుందని, ఏ పదవి వచ్చినా సమర్థవంతంగా నిర్వర్తిస్తానని చెప్పుకొచ్చారు. ఢిల్లీ నుంచి ఇంకా ఫోన్ రాలేదని తెలిపారు. 'సామర్థ్యాన్ని బట్టి మంత్రులను ఎంపిక చేయాలి. భువనగిరి ఎంపీ ఎన్నికల బాధ్యతలు సమర్థంగా నిర్వహించా. నాకు హోంమంత్రి పదవి అంటే ఇష్టం' అని పేర్కొన్నారు. తెలంగాణ క్యాబినెట్ విస్తరణకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే.



# పాస్టర్ ప్రవీణ్ అనుమానస్పద మృతి...

**రాజమండ్రి మార్చి 25(ప్రజాక్షేత్రం):** కల్వరిలో క్రైస్తవ బోధకుడిగా ఉన్న పాస్టర్ ప్రవీణ్ ఈరోజు కొంతమూరు హైవేపై అనుమానస్పదంగా మృతి చెందారు. అయితే తనకి ప్రాణహాని ఉందని ప్రవీణ్ నెల క్రితమే చెప్పారు. ఈ నేపథ్యంలో ఆయనది హత్య లేక.. అనుకోని ప్రమాద సంఘటనలో మృతి చెందారా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఆయన మృతదేహాన్ని పోలీసులు రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రి వద్ద ఉద్రిక్తతల నెలకొంది. క్రైస్తవ ఆరాధకులు రాజమండ్రి ఎయిర్‌పోర్ట్ నుండి ప్రమాద స్థలం వరకు ప్రవీణ్ ప్రయాణానికి సంబంధించి మొత్తం సిసిటివి ఫుటేజ్‌ని పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా, పాస్టర్ ప్రవీణ్ మృతికి సినీనటుడు రాజా సంతాపం తెలిపారు.






టాలీవుడ్ స్టార్ హీరోయిన్‌గా ఒక్కప్పుడు చక్రం తిప్పింది పూజా హెగ్డె. కెరీర్ బిగినింగ్ లోనే తన అందం,నటనతో తెలుగు ప్రేక్షకులను కట్టిపడేసింది. దాదాపు అందరు స్టార్ హీరోలతో జత కట్టింది ఈ చిన్నది. మధ్యలో ఇక్కడ అవకాశాలు తగ్గడం వరుస అపజయాలు ఎదురవ్వడంతో బాలీవుడ్ లోకి జంప్ అయిన ఈ ముద్దుగుమ్మ. అక్కడ కూడా కొంత నిరాశే చవి చూసింది. కానీ ప్రజంట్ తమిళ, హింది భాషలో వరుస ప్రజెక్ట్‌లు లైన్ లో పెట్టించి పూజ. ఇదిలా ఉంటే మనకు తెలిసి సోషల్ మీడియాలో ట్రోలింగ్ కామన్. దీనికి ఎవరూ మినహాయింపుగా నిలవడం లేదు. కొందరు ఫాలోయింగ్ కోసం, మరికొందరు అదో రకమైన పైశాచిక ఆనందం తో ఇలా రకరకాల కారణాల వల్ల ఆన్ లైన్‌ని ఒక చెత్తబుట్టగా మార్చేస్తున్నారు. అయితే స్టార్ హీరోలు, హీరోయిన్‌లు వీటిని పెద్దగా పట్టించుకోరు.కానీ గ్రౌండ్ లెవెల్‌లో అభిమానులు చేసుకునే ట్రోలింగ్ వార్ మహా దారుణంగా ఉంటుంది. దీని బారిన పడిన హీరోయిన్ లు కూడా చాలా మంది ఉన్నారు. అందులో పూజా హెగ్డే కూడా ఒకరు. అవును ఇటీవల ఒక ఇంటర్వ్యూలో దీని గురించి స్పందించింది. ‘ నేను సాధారణంగా కొన్ని పిచ్చి విషయాలు పట్టించుకోను. కానీ అదే పనిగా నా పై వచ్చేసరికి ట్రోల్స్ చూసి తట్టుకోలేక పోయాను. వెంటనే నా టీమ్ తో నను ట్రోల్ చేస్తున్న పేజెస్ గురించి కనుక్కోమని చెబితే, అప్పుడు షాకింగ్ విషయాలు కొన్ని తెలిశాయి. వెనుక నుండి కొందరు డబ్బులిచ్చి మరీ ట్రోలింగ్ చేయిస్తున్నా సంగతి బయట పడింది. అంతే కాదు ఒకవేళ వాటిని ఆపాలంటే ఎంత మొత్తం ఖర్చవుతుందో కూడా ముందే చెప్పేస్తున్నారు. అంటే చేయడానికి ఒక రేటు, చేసింది ఆపడానికి ఒక రేటు. ఈ వ్యాపారమే దో బాగుంది కదా. అలాని ఉత్తి పుణ్యానికి డబ్బులు ఇచ్చుకుంటూ పోలేం కదా’ అని తెలిపింది.

## డబ్బు తీసుకొని మరి నన్ను ట్రోల్ చేస్తున్నారు..

## చిరంజీవి సినిమాపై మోహన్ లాల్ షాకింగ్ కామెంట్స్

మళయాల సూపర్ స్టార్ మోహన్ లాల్ కు టాలీవుడ్ తో మంచి అనుబంధం ఉంది. ఆయన సినిమాలు తరచూ తెలుగులో రిలీజ్ కావడం లేదంటే రీమక్ లాంటివి అవుతూనే ఉంటాయి. తాజాగా ఆయన పృథ్వీరాజ్ సుకుమారన్ డైరెక్షన్ లో లూసీఫర్2 సినిమా చేస్తున్నారు. ఇప్పటికే మూవీపై అంచనాలు భారీగా పెరిగాయి. మార్చి 27న మూవీ రిలీజ్ కాబోతోంది. అయితే మూవీ ప్రమోషన్లు ఇటు తెలుగులో కూడా భారీగా చేస్తున్నారు. ఈ సందర్భంగా మోహన్ లాలా చిరంజీవి సినిమా గురించి షాకింగ్ కామెంట్స్ చేశారు. మోహన్ లాల్ తీసిన లూసీఫర్ సినిమాను తెలుగులో చిరంజీవి గాడ్ ఫాదర్ పేరుతో రీమేక్ చేశారు. మోహన్ రాజా డైరెక్షన్ లో వచ్చిన ఈ సినిమాలో చిరుతో పాటు నయనతార కూడా నటించారు. అయితే తాజాగా గాడ్ ఫాదర్ సినిమా గురించి ఓ ఇంటర్వ్యూలో మోహన్ లాల్ మాట్లాడారు.

‘లూసీఫర్ సినిమాతో గాడ్ ఫాదర్ తీశారు. ఆ తెలుగు వెర్షన్ నేను కూడా చూశాను. అందులో కొన్ని పాత్రలు, సీన్లు తీసేశారు. తెలుగు నేటివిటీకి తగ్గట్టు దాన్ని తీశారు. కానీ లూసీఫర్2 మూవీతో గాడ్ ఫాదర్2 తీయలేరు. ఎందుకంటే ఇందులో పాత్రలను తీసేయడం అసాధ్యం. ప్రతి పాత్రకు కథలో కీలకమైన లింక్ ఉంటుంది’ అంటూ చెప్పుకొచ్చారు మోహన్ లాల్ . లూసీఫర్ సినిమాలో ఉన్న టోవినో థామస్ పాత్రను గాడ్ ఫాదర్ లో తీసేసిన సంగతి తెలిసిందే. దాన్ని దృష్టిలో పెట్టుకుని మోహన్ లాల్ ఈ కామెంట్స్ చేశారు. అయితే ఎల్ 2లో టోవినో థామస్ కీలక పాత్ర చేస్తున్నారు. మొదటి పార్టులో కంటే ఈ పార్టులో ఆయన పాత్ర ఎఫెక్ట్ ఎక్కువగా ఉండబోతోంది. ఎల్ 2 ఫుల్ యాక్షన్ మోడ్ లో వస్తోంది. మరి ఈ మూవీ ఏ స్థాయి హిట్ అందుకుంటుందో వేచి చూడాలి.



## డేవిడ్ వార్నర్‌కు క్షమాపణలు చెప్పిన రాజేంద్ర ప్రసాద్

టాలీవుడ్ సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్‌కు క్షమాపణలు తెలిపాడు. నితిన్ సినిమా రాబిన్‌హుడ్ ప్రీ రిలీజ్ వేడుకలో తాను చేసిన వ్యాఖ్యలపై వీడియో రూపంలో క్షమాపణలు చెప్పకోచ్చాడు. నితిన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ‘రాబిన్‌హుడ్’. ఈ సినిమాకు వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తుండగా.. మైత్రీ మువీ మేకర్స్ నిర్మిస్తుంది. శ్రీలీల కథానాయిక. ఈ చిత్రం మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించగా.. ఇందులో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ఈ వార్నర్‌ని క్రికెట్ ఆడమంటే దొంగ ము* కొడుకు సినిమాలు చేస్తున్నాడు అంటూ సంచలన వ్యాఖ్యలు చేశాడు. అయితే నటకిరిటి ఇవి సరదాగా చేసిన కూడా మీడియాతో పాటు నెటిజన్లు ఈ వ్యాఖ్యలపై దుమ్మెత్తిపోశారు. దీంతో దిగోచ్చిన రాజేంద్ర ప్రసాద్ తాజాగా డేవిడ్ వార్నర్‌కు క్షమాపణలు తెలిపాడు. నాకు డేవిడ్ వార్నర్ అంటే చాలా ఇష్టం. అతడి క్రికెట్ అంటే కూడా నాకు చాలా ఇష్టం. నేను అతడిపై చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు తెలుపుతున్నాను. ఇటువంటి సంఘటనలు మళ్లీ జరుగకుండా చూసుకుంటానంటూ రాజేంద్రప్రసాద్ చెప్పకోచ్చాడు.





## నితిన్ ‘రాబిన్‌హుడ్’ టికెట్ ధరల పెంపు..

నితిన్ కథానాయకుడిగా వెంకీ కుడుముల దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘రాబిన్‌హుడ్’. శ్రీలీల కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. మార్చి 28న ఈ మూవీ విడుదల కానుంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లో టికెట్ ధరల పెంపునకు అనుమతి లభించింది. దీనిపై సామాజిక మాధ్యమాల వేదికగా విమర్శలు వస్తుండటంతో చిత్ర నిర్మాణ సంస్థ వివరణ ఇచ్చింది. ఎంపిక చేసిన థియేటర్స్‌లో మాత్రమే టికెట్ ధరల పెంపు వర్తిస్తుందని తెలిపింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది.



PRINTED, PUBLISHED AND OWNER BY K PRAVEEN KUMAR, PRINTED AT M R PUBLICATIONS, #631880, VANASTHALIPURAM, RANGA REDDY (DIST), HYDERABAD, TELANGANA 500070.
PUBLISHED AT H.NO. 250 SHANKAR PALLY, RANGA REDDY, HYDERABAD, TELANGANA 501203. EDITOR : K PRAVEEN KUMAR. PHONE NUMBER 9177920459,
EMAIL ID : PRAJAKSHETRAM1@GMAIL.COM, HTTPS://PRAJAKSHETRAM.IN, RNI NO. TELTEL/12330